RNI TELTEL 2024/90138

# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు




| హైదరాబాద్ । మేడ్చల్ । రంగారెడ్డి । మహబూబాద్ । కరీంనగర్ । అదిలాబాద్ । మెదక్ । వరంగల్ । ఖమ్మం । నిజామాబాద్ । నల్లగొండ । భద్రాద్రి కొత్తగూడెం | ప్రధాన సంపాదకులు : కురిమీళ్ల చంద్రశేఖర్ గౌడ్ | సోమవారం 25 - మే - 2026 | సంపుటి : 05 | సంచిక : 0 66 | పేజీలు : 8 | వెల - 5 / |
|---|---|---|---|---|---|---|
| CIRCULATED IN HYDERABAD \| MEDCHAL MALKAJGIRI \| RANGAREDDY \|KHAMMAM \| KARIMNAGAR \| MAHABOOBNAGAR \| YADADRI BHUVANAGIRI \| NALGONDA \| NIZAMABAD \| WARANGAL \| MAHABUBABAD \| MEDAK \| ADILABAD \| RANGAREDDY | CHIEF EDITOR: KURIMILLA CHANDRA SHEKAR GOUD | Monday 25- 05 - 2026 | VALLUM - 05 | ISSUE 0 66 | PAGES - 8 | RS 5 / |

## బెంగాల్‌లో ఫాల్తా రీపోలింగ్‌లో బీజేపీ ఘనవిజయం...

### టీఎంసీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతు

- లక్షకు పైగా ఓట్ల తేడాతో గెలుపొందిన దేబాంగ్శు పండా
- చరిత్రలో తొలిసారి నాలుగో స్థానానికి పడిపోయిన తృణమూల్ కాంగ్రెస్
- డిపాజిట్లు కోల్పోయిన టీఎంసీ, కాంగ్రెస్ అభ్యర్థులు
- అక్రమాల ఆరోపణలతో ఫల్టాలో రీపోలింగ్ నిర్వహించిన ఈసీ

పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రీపోలింగ్ ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్శు పండా ఏకంగా 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో



## ఎబోలాపై ఏపీ ప్రభుత్వం దృష్టి..

### విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా

- ఆఫ్రికా దేశాల్లో వేగంగా పెరుగుతున్న ఎబోలా కేసులు
- అక్కడి నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రోడ్డు మార్గాలపై కూడా నిఘా



ఆఫ్రికా దేశాలలో ఎబోలా వైరస్ కేసులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ రంగంలోకి దిగింది. ముఖ్యంగా ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా, సూడాన్ వంటి దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే ప్రయాణికులకు

## కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..

### బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?

- త్వరలో బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు
- బెంగళూరులో నివసిస్తున్న లక్షలాది మంది తమిళులు
- కర్ణాటకలో జెండా పాతాలనుకుంటున్న విజయ్



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా,

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

### కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

- వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్
- ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ
- మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య
- గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ






- ప్రభుత్వ నిర్ణయంతో కలకలం - బీఆర్ఎస్ నేతలపైనే గురి అంటూ చర్చ - అందరి దృష్టి మాజీ మంత్రులు, ఎంపీపైనే

రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన మైనింగ్ అక్రమాలపై సీఐడీ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం జిల్లాలో కలకలం రేపుతోంది. జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమపై నాడు జీఎస్టీ, టాక్సుల ఎగవేత, అక్రమ రవాణా ఆరోపణలు వచ్చాయి. తాజాగా నకిలీ వేబిల్లులతో గ్రానైట్ పాలిష్డ్ షీట్స్ హైదరాబాద్‌కు తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ సంఘటనలతో కోట్లాది రూపాయల పన్నుల ఎగవేతలు వెలుగులోకి వచ్చాయి. ముగ్గురు మాజీ మంత్రులు, రాజ్యసభ సభ్యుడిని లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ప్రస్తుత కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేరు తెరపైకి వస్తున్నది. ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు గ్రానైట్ పరిశ్రమలో ఉండడం, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న వారి వ్యాపార సంస్థలు దేశవిదేశాల్లో గ్రానైట్ వ్యాపారానికి పేరుగాంచడంతో అందరి దృష్టి వారివైపు మళ్లింది.

**జిల్లాలో 320కిపైగా గ్రానైట్ సంస్థలు**

జిల్లాలో రెండున్నర దశాబ్దాలుగా గ్రానైట్ పరిశ్రమ విస్తరించి వేల మందికి ఉపాధి కల్పిస్తున్నది. 320కిపైగా గ్రానైట్ సంస్థలు ఇక్కడ ప్రభుత్వం నుంచి స్థలాలను లీజుకు తీసుకొని గ్రానైట్‌ను తవ్వి చైనా తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. వందలాది పాలిషింగ్ యూనిట్లు ఏర్పడి గ్రానైట్ బ్లాక్‌లను కోసి టైల్స్‌గా తయారుచేసి స్థానికంగా విక్రయించడంతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఎనిమిది గ్రానైట్ ఏజెన్సీలు స్థానిక గ్రానైట్ క్వారీలలో తవ్వితీసిన గ్రానైట్ దిమ్మలను సముద్ర

## మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం



- జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు నిధులు కేటాయించిన రేవంత్ ప్రభుత్వం
- రైతులను కాపాడాలని సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్న తుమ్మల
- పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

## రేపటి నుంచి 'రైతు గోస బీజేపీ భరోసా' యాత్ర:

- రైతులతో రాజకీయాలు చేయడం రేవంత్ కు అలవాటుగా మారిందన్న రఘునందన్ రావు
- అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి ప్రజలకు సీఎం తప్పుడు సమాచారం ఇస్తున్నారని విమర్శ
- ప్రభుత్వ వైఫల్యాలపై నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామన్న బీజేపీ ఎంపీ



## కలిసొస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాధ్యతలు



ఇప్పటికి మంత్రులైన ముగ్గురు ఇన్‌చార్జి కార్యదర్శులు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జులకు అనుబంధంగా పనిచేసిన ఇన్‌చార్జి కార్యదర్శులకు తమ సొంత రాష్ట్రాల్లో కలిసివస్తోంది. తెలంగాణ ఏర్పాటైన దగ్గరి నుంచి ఇప్పటి దాకా పనిచేసిన ఇన్‌చార్జి కార్యదర్శుల్లో ముగ్గురు.. వారి సొంత రాష్ట్రాల్లో మంత్రులయ్యారు. మరొకరు సొంత రాష్ట్రంలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2018 ఎన్నికల ముందు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా వ్యవహరించిన కుంతియాకు అనుబంధంగా అధిష్ఠానం కర్ణాటకకు చెందిన బోసురాజును తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించింది. 2018 ఎన్నికల్లోనూ, ఆ తర్వాతా ఆయన పార్టీలో కీలక భూమిక పోషించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి



జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు

- జగన్ తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్
- ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి
- ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు
- పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు

సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
సోమవారం 25 - 05 -2026

# గ్రానైట్ అక్రమాలపై సీఐడీ

రవాణా ద్వారా చైనాకు పంపించడం 2010 తర్వాతే ప్రారంభమైంది.

**రూ. 124.94 కోట్ల పన్నుల ఎగవేత.. ఆరు రెట్ల ఫెనాల్టీ** 2013 సంవత్సరంలో కృష్ణపట్నం ఓడరేవు ద్వారా రవాణా చేసిన గ్రానైట్ దిమ్మల పరిమాణాలు నమోదు చేయడంలో అక్రమాలు చేసి ప్రభుత్వ ఖజానాకు 124.94 కోట్ల రూపాయలు గండికొట్టారని ఆరోపణలు వచ్చాయి. సీపోర్టులో ఉన్న స్టాక్‌ను పరిశీలించిన అధికారులు అక్రమాల నిగ్గుతేల్చి 124.94 కోట్ల రూపాయల పన్నులు ఎగవేశారని తేల్చారు. దీంతో అప్పటి ప్రభుత్వం ఆరు రెట్ల ఫెనాల్టీతో కలిపి 749. 66 కోట్ల రూపాయలు చెల్లించాలని గ్రానైట్ రవాణా ఏజెన్సీలను ఆదేశించింది. శ్వేత గ్రానైట్స్ సంస్థ 57.77 కోట్లు, శ్వేత ఏజెన్సీస్ 4.19 కోట్లు, ఏఎస్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ 6,64 కోట్లు, జేఎం బక్షీ కంపెనీ 19. 32 కోట్లు, మైథిలీ ఆదిత్య సంస్థ 33.65 కోట్లు, కేవీఆర్ ఏజెన్సీస్ 92.38 లక్షలు, అరవింద్ గ్రానైట్స్ 94.86 లక్షలు, సంధ్యా ఏజెన్సీస్ 1.5 కోట్ల రూపాయల పన్నులు ఎగవేసి అక్రమాలకు పాల్పడ్డాయని తేల్చి వీటికి ఆరు రెట్ల ఫెనాల్టీని విధించారు. అప్పుడు ప్రభుత్వం వద్ద అప్పీలు చేసుకొని కొంత మేరకు డబ్బుచెల్లించి ఆయా సంస్థలు మళ్ళీ వ్యాపారాన్ని ప్రారంభించాయి.

**పలువురి ఫిర్యాదు** గ్రానైట్ సంస్థల అక్రమాలపై స్థానిక న్యాయవాదులు, ఆనాటి బీజేపీ నేతలు బేతి మహేందర్‌రెడ్డి, ఎ గంగాధర్, వైసీపీ నేత సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి మైనింగ్ ఉన్నతాధికారులకు జీఎస్టీ, కమర్షియల్ టాక్సు అధికారులకు, ఈడీ, ఐటీ తదితర శాఖలకు ఫిర్యాదులు చేశారు. ఫలితం లేక పోవడంతో కేంద్ర గనులశాఖ మంత్రికి, హోంశాఖ మంత్రి అమితషా, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఫిర్యాదు చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో కేంద్రానికి ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. మరో సీనియర్ బీజేపీ నాయకుడు పేరాల శేఖర్‌రావు గ్రానైట్ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వంలోని పలువురు నేతలకు ఫిర్యాదులు చేయడంతో కొంత కదలిక వచ్చింది. ఈడీ, విజిలెన్సు, మైనింగ్ తదితర సంస్థలు సోదాలు జరిపి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నాయి. విచారణలో ఏమి తేలిందో, ఎవరిపై ఏ చర్యలు తీసుకున్నారో వెల్లడి కాకుండా చిదంబర రహస్యంగానే మిగిలిపోయింది. ధీనితో న్యాయవాదులు మహేందర్‌రెడ్డి, గంగాధర్ మళ్ళీ తమ ఫిర్యాదుల పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో కలకలం** ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంతరెడ్డి రాష్ట్రంలో గ్రానైట్, ఇసుక తదితర మైనింగ్ వ్యవహారాల్లో గత 10 సంవత్సరాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని వాటిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఐడీ విచారణ జరపాలని నిర్ణయించడంతో జిల్లాలో కలకలం రేకెత్తుతోంది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు సంబంధించిన గ్రానైట్ సంస్థలు ఉండడంతో ఇది ఏ రాజకీయ మార్పులకు దారితీస్తుందోనని చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారం ఇలా ఉండగానే తాజాగా మరో 100 కోట్ల రూపాయల గ్రానైట్ అక్రమ వ్యాపార వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. బోగస్ సంస్థ పేరిట ఇన్వాయిస్ వేబిల్లులు తయారుచేసి గ్రానైట్ పాలిషింగ్ టైల్స్, షీట్స్ హైదరాబాద్‌కు తరలిస్తున్న వ్యవహారం తెలుసుకొని జీఎస్టీ నిఘా విభాగం అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఒకరిని అరెస్టు చేసి నాంపల్లి ఆర్థిక నేరాల కోర్టులో హాజరుపరచారు. ఇలాంటి వ్యవహారాలు ఎన్నో జరుగుతున్నాయని, గ్రానైట్ వ్యాపారం నష్టాల్లో ఉందని చెబుతూ ప్రచారం చేస్తూ కోట్లాది రూపాయల పన్నులు ఎగవేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సీఐడీ విచారణలో ఈ అక్రమ వ్యాపారాలపై కూడా నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# కలిసొస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాధ్యతలు

అయితే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిన తర్వాత.. అధిష్ఠానం బోసురాజుకు కర్ణాటక మంత్రివర్గంలో స్థానం కల్పించింది. ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవకున్నా ఎమ్మెల్సీని చేసి మరీ క్యాబినెట్‌లో చోటు కల్పించింది. అలాగే కర్ణాటకకే చెందిన సలీం అహ్మద్ గతంలో తెలంగాణలో ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరించారు. తదనంతర కాలంలో ఆయనను అధిష్ఠానం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది. అలాగే ఎమ్మెల్సీనీ చేసింది. ఇక ఇటీవలి వరకూ తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శులుగా వ్యవహరించిన విష్ణునాథ్‌కు కేరళ మంత్రివర్గంలో, విశ్వనాథన్‌కు తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కింది. కేరళ ఎన్నికల్లో పోటీ చేసిన విష్ణునాథ్.. ఆ ఎన్నికలకు ముందే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో అధిష్ఠానం సచిన్ సావంత్‌ను నియమించింది. కేరళ ఎన్నికల్లో గెలిచిన విష్ణునాథ్‌కు యూడీఎఫ్ మంత్రివర్గంలో చోటు లభించింది. ఇక తమిళనాడుకు చెంది న పి.విశ్వనాథన్‌కు అనుకోని అవకాశం దక్కింది. తమిళనాడు ఎన్నికల్లో డీఎంకేతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ కేవ లం ఐదు సీట్లు గెలుచుకుంది. ఎన్నికల అనంతరం జరిగిన నాటకీయ పరిణామాల్లో విజయ్ పార్టీ టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ నుంచి ఇద్దరికి విజయ్ క్యాబినెట్‌లో చోటు దక్కింది. ఆ ఇద్దరిలో ఒకరైన విశ్వనాథన్‌కు ఉన్నత విద్యాశాఖ మంత్రిగా అవకాశం దక్కింది. ఏది ఏమైనా తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి కార్యదర్శులుగా వ్యవహరించిన వారిని సొంత రాష్ట్రాల్లో అదృష్టం కలిసొస్తుందన్న ప్రచారం పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

**సీఎం రేవంత్‌ను కలిసిన తమిళనాడు మంత్రి విశ్వనాథన్** తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి పి.విశ్వనాథన్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వనాథన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. కొత్తగా తమిళనాడు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను అభినందించారు. ప్రజాభవన్‌కు వెళ్లిన విశ్వనాథన్.. మంత్రి సీతక్కను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి:

అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

### విజయ్ గెలుపు ఒక 'సినిమా సునామీ'.. ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు: స్టాలిన్

తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ' మాత్రమేనని స్టాలిన్ అభివర్ణించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, కేవలం ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని... కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు. టీవీకే పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్ అయిన 118 సీట్ల మార్కును దాటడంలో పూర్తిగా విఫలమైందని గుర్తుచేశారు. కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయిన ఆ ప్రభుత్వం, ఈ రోజు డీఎంకే కూటమిలోని పార్టీల మద్దతు వల్లే మనుగడ సాగిస్తోందని, ఏ క్షణమైనా ఈ ప్రభుత్వం కూలిపోవచ్చని హెచ్చరించారు.

# మూడు కోతుల తత్వం.. నేటి సమాజానికి సరిపోతుందా?

నేటి ఆధునిక సమాజం గురించి మాట్లాడాలంటే, మనం ఒక విచిత్రమైన వైరుధ్యాన్ని ఎదుర్కొంటాం. ఒకవైపు అద్భుతమైన సాంకేతిక విప్లవం, అపారమైన జ్ఞాన వికాసం, సమాచార విస్ఫోటనం మనల్ని ముంచెత్తుతుంటే మరొకవైపు నైతిక పతనం, మానవ విలువల క్షయం, దైనందిన జీవితంలో అమానవీయ ప్రవర్తన మనల్ని కలవరపెడుతున్నాయి. రోడ్డు మీద నడిచినా, ఉదయాన్నే సోషల్ మీడియా అకౌంట్లు తెరిచినా, లేక వార్తాపత్రిక చేతిలోకి తీసుకున్నా అవినీతి, మోసం, హింస, అన్యాయం అడుగడుగునా కనిపిస్తాయి. ఈ క్లిష్ట నేపథ్యంలో ప్రతి ఒక్కరి మనసులోనూ ఒక తీవ్రమైన ప్రశ్న మెదులుతుంది. నేటి దుష్ట సమాజంలో మనిషి మూగ, చెవిటి, గుడ్డి అయితే అంటే చెడు మాట్లాడకుండా, చెడు వినకుండా, చెడు చూడకుండా ఉంటే ప్రశాంతంగా జీవించగలడా? ఈ ప్రశ్న కేవలం శారీరక వైకల్యం లేదా అసమర్థత గురించి కాదు. ఇది ప్రస్తుత సమాజంలో సగటు మానవుడు అనుభవిస్తున్న ఘర్షణకు సంబంధించిన ఒక లోతైన తాత్విక, సామాజిక, మరియు మనోవైజ్ఞానిక విశ్లేషణ. దీనిని పత్రికా ప్రపంచపు లోతులతో, మానవీయ కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జపాన్ సంస్కృతి నుండి వచ్చిన "మిజారు, కికాజారు, ఇవాజారు" అంటే "చూడకు, వినకు, మాట్లాడకు" అనే మూడు జ్ఞాన కోతుల తత్వం ప్రపంచమంతటా ప్రసిద్ధి పొందింది. భారత జాతి పిత మహాత్మా గాంధీ కూడా ఈ మూడు కోతుల బొమ్మను నిరంతరం తన దగ్గర ఉంచుకుని, దాని సందేశాన్ని గౌరవించారు. అయితే, చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు అనే సూత్రాన్ని అక్షరాలా జీవితంలో అమలు చేస్తే నిజంగానే శాంతి లభిస్తుందా? ఈ ప్రశ్నకు జవాబు అంత సరళంగా లేదు.

ఒక మానసిక కోణంలో చూస్తే సమాజంలో నిరంతరం ప్రవహించే నెగటివిటీని, అనవసర కోలాహలాన్ని, విద్వేషపూరిత వాతావరణాన్ని మనసుకు దూరంగా ఉంచుకోవడం వ్యక్తిగత మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనోవైజ్ఞానికులు అంగీకరిస్తారు. దీనివల్ల నిత్య జీవితంలో ఒత్తిడి తగ్గుతుంది. కానీ సామాజిక కోణంలో చూస్తే చుట్టూ అన్యాయం జరుగుతున్నప్పుడు మూగవాడిగా, చెవిటివాడిగా, గుడ్డివాడిగా నటించడం అంటే ఆ అన్యాయాన్ని పరోక్షంగా ప్రోత్సహించడమే అవుతుందని సమాజ శాస్త్రవేత్తలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. మనం జీవిస్తున్న ఈ 21వ శతాబ్దపు సమాజం ఎలాంటి పోకడలను సంతరించుకుంది? పత్రికలు తిరగేస్తే రాజకీయ అవినీతి, బంధుప్రీతి, న్యాయస్థానాలలో అనంతమైన జాప్యం, మహిళలపై అమానుష దాడులు, పేదల శ్రమ దోపిడీ, విద్యా వైద్య రంగాలలో వ్యాపారీకరణ మరియు మోసాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇక డిజిటల్ ప్రపంచంలోకి అడుగుపెడితే, సోషల్ మీడియా వేదికలపై అబద్ధాల వరద, ద్వేషపు వ్యాఖ్యలు, నకిలీ వార్తలు, వ్యంగ్య పూరిత వ్యక్తిగత దాడులు రాజ్యమేలుతున్నాయి. వీధిలోకి వస్తే దౌ0ర్జన్యాలు, రోడ్ రేజ్, అసభ్య ప్రవర్తన సర్వసాధారణమైపోయాయి. ఇలాంటి కలుషిత వాతావరణంలో ఒక సాధారణ, నిజాయితీపరుడైన మనిషి ఏం చేయాలి? చూస్తే మనసుకి నొప్పి. వినాల్సింది వస్తే గుండె కోత. ధైర్యం చేసి మాట్లాడితే ప్రాణాలకే ప్రమాదం. అందుకే నేడు చాలామంది నాకేమీ పట్టదు, నా బతుకు నాదే అనే ఒక సురక్షితమైన శంఖంలోకి దూరిపోతున్నారు. ఇది మానవ సహజమైన స్వయం రక్షణ ప్రతిచర్యే కావచ్చు, కానీ ఇది సమాజానికి శాశ్వత పరిష్కారం ఎలా అవుతుంది? నిజం మాట్లాడినందుకు ఉద్యోగాలు కోల్పోయిన విద్యావంతులు, అవినీతిని ఎదిరించినందుకు ప్రాణాలు పోగొట్టుకున్న సామాజిక కార్యకర్తల (విజిల్ బ్లోయర్స్) సందర్భాలు మన సమాజంలో అనేకం ఉన్నాయి. అందుకే ఇబ్బందులు కొనితెచ్చుకోవడం ఇష్టం లేక చాలామంది మూగతనాన్ని ఒక ఆయుధంగా ఎంచుకుంటారు. మాట్లాడకపోతే ప్రశ్నలు రావు, శత్రువులు పెరగరు, తద్వారా సమస్యలు దరిచేరవు ఇది ఒక అద్భుతమైన రక్షణ కవచం అని భ్రమిస్తారు. కానీ చరిత్ర మనకు బోధించే సత్యం వేరేగా ఉంది. నాజీ జర్మనీ కాలంలో హిట్లర్ దురాగతాలను ప్రశ్నించకుండా మాట్లాడకుండా ఉండిపోయిన లక్షలాది మంది మంచివాళ్ళు కూడా చివరికి ఘోరమైన నష్టాన్ని, బాధలను అనుభవించారు. మన దేశంలోనూ అవినీతిని ప్రశ్నించకుండా మిన్నకుండిన సామాన్యులు, చివరికి ఆ అవినీతి పెరిగి పెద్దదై వ్యవస్థలను నాశనం చేసినప్పుడు తామే దానికి బాధితులుగా మారిన సందర్భాలు కోకొల్లలు. నేను ఎవరి జోలికీ వెళ్ళలేదు కదా, నాకేమీ కాదు అనే భ్రమ సమాజం పతనమయ్యేటప్పుడు పటాపంచలు కాక తప్పదు. అంతేకాకుండా, అన్యాయాన్ని చూస్తూ కూడా పెదవి విప్పలేకపోవడం మనిషిని లోపల మానసికంగా కుళ్ళిపోయేలా చేస్తుంది. మనసులో తీవ్రమైన అసంతృప్తిని, నిస్సహాయతను తొక్కిపెట్టుకుని బతకడం అనేది ఒక రకమైన స్వీయ మానసిక హింస. దీర్ఘకాలంలో ఇది తీవ్రమైన నిరాశకు, డిప్రెషన్‌కు దారితీస్తుంది. నేను చెడు వినను అని లోకంలోని వార్తలకు, సమస్యలకు చెవులు మూసుకుంటే అంతా ప్రశాంతంగా ఉంటుందని కొందరు భావిస్తారు. టీవీ ఛానెళ్లు చూడడం మానేస్తారు, రాజకీయ చర్చల జోలికి వెళ్లరు, సమాజంలో ఏ దారుణం జరిగినా నాకెందుకు? అని ముఖం తిప్పేసుకుంటారు. దీనివల్ల తాత్కాలికంగా కొంత నిరాందోళన, మానసిక ఉపశమనం లభించవచ్చు. కానీ చెవిటితనాన్ని స్వచ్ఛందంగా పాటించినంత మాత్రాన మన చుట్టూ ఉన్న కఠిన వాస్తవాలు మారిపోవు. సమాజంలో అవినీతి తగ్గిపోదు, అన్యాయాలు ఆగిపోవు. ఒకరోజు ఆ అన్యాయపు వేడి నేరుగా మన సొంత ఇల్లు లేదా మన పిల్లల తలుపు తట్టినప్పుడు నాకు తెలియదు, నేను వినలేదు అనే సమాధానం ఏమాత్రం రక్షణ కల్పించలేదు. అదేవిధంగా, నేను చూడను, నాకు అనవసరం అనే ఐచ్ఛిక అంధత్వం (రావశ్రీవవ్జీఅజవ దీశ్రీఱఅఎఅవంం) నేడు పట్టణ సంస్కృతిలో చాలా సాధారణమైపోయింది. పక్కింటి మహిళ వేధింపులకు గురవుతున్నా, రోడ్డు మీద ఎవరో ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నా, పక్క వీధిలో అక్రమాలు జరుగుతున్నా నాకేమీ కనిపించడం లేదు అని కళ్ళు మూసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. నీతిశాస్త్రం స్పష్టంగా చెబుతోంది. చెడుకు అడ్డుపడే కళ్ళు, నిలదీసే గొంతు లేనిచోట, చెడు నిరభ్యంతరంగా చెలరేగుతుంది. మన కళ్ళు మూసుకోవడం వల్ల ప్రమాదం తప్పదు, పైగా మనల్ని మరింత బలహీనమైన, హాని చేయదగిన స్థితిలోకి నెట్టేస్తుంది. ఒకవేళ ఒక వ్యక్తి మూగ, చెవిటి, గుడ్డి ఈ మూడు లక్షణాలనూ ఒకేసారి అలవరచుకుంటే ఏం జరుగుతుంది? అంటే సమాజంలోని ఏ విషయాలనూ చూడకుండా, వినకుండా, మాట్లాడకుండా ఉంటే అతడు సమాజంతో సంబంధాలు పూర్తిగా తెంచుకుని, ఒక స్వార్థపూరితమైన వ్యక్తిగత గుహలో బందీ అవుతాడు. ఇది ఎంతటి ప్రశాంతతను ఇచ్చినా, దానిని జీవన సౌందర్యం అనలేము; అది కేవలం ఒక 'జీవచ్ఛవం' లాంటి స్థితి మాత్రమే. అనుభవపూర్వక వాస్తవం ఏమిటంటే, ఈ క్రూరమైన సమాజం ఇలాంటి మూగ, చెవిటి, గుడ్డి వారిని వదిలిపెట్టదు. ఈ మనిషి ఎలాగూ ఎదురు తిరగడు, ఎవరికీ చెప్పుకోలేడు, ప్రశ్నించలేడు అని తెలుసుకున్న దుర్మార్గులు అలాంటి వారిపై ఇంకా ఎక్కువగా దాడులు చేస్తారు, సులభంగా దోచుకుంటారు. కాబట్టి, సామాజిక బాధ్యతల నుండి పారిపోవడం లేదా మిన్నకుండటం అనేది ఎప్పటికీ భద్రతను ఇవ్వదు, పైగా అది దుర్మార్గులకు మరింత స్వేచ్ఛగా విహరించడానికి రాజమార్గాన్ని సుగమం చేస్తుంది. నేటి క్లిష్ట సమాజంలో మానసిక ప్రశాంతతతో పాటు గౌరవంగా బ్రతకాలంటే చేతగానివారిలా మూగ, చెవిటి, గుడ్డి అవడం అస్సలు పరిష్కారం కాదు. నిజమైన వివేకవంతుడి మార్గం సమతుల్యతతో కూడి ఉంటుంది. దానిని ఇలా అర్థం చేసుకోవచ్చు: నేటి సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ ప్రశాంతంగా జీవించడానికి ఒక వివేకవంతుడి మార్గం ఎంతో ఆదర్శవంతమైనది. దీని ప్రకారం, సమాజంలోని ప్రతి చెడునూ చూసి గుండెలు బాదుకోకుండా, ఏది స్వీకరించాలో ఏది వదిలేయాలో తెలిసిన వివేకంతో చూడడం మొదటి సూత్రం. అలాగే, అనవసరమైన ప్రతికూలతలను, సోషల్ మీడియా ట్రోల్స్‌ను పట్టించుకోకుండా, అన్యాయానికి గురైన బాధితుల ఆర్తనాదాలను మాత్రం ఆలకించేలా ఎంపికతో వినడం అలవరచుకోవాలి. వ్యర్థమైన వాదోపవాదాలకు దూరంగా ఉంటూనే, సమాజ రక్షణ కోసం అవసరమైనప్పుడు సందర్భోచితంగా ధైర్యంగా మాట్లాడడం ముఖ్యం. వీటన్నింటికీ తోడు, చుట్టూ ఉన్న చెడు మనల్ని కుంగదీయకుండా ధ్యానం, సత్కాలక్షేపం, మరియు సేవా కార్యక్రమాల ద్వారా మానసిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ మనసును ఎల్లప్పుడూ సమతుల్యంగా ఉంచుకోవడమే నిజమైన వివేకం. నేటి దుష్ట సమాజంలో మూగ, చెవిటి, గుడ్డి అయితే ప్రశాంతంగా బ్రతకవచ్చు అనేది కేవలం ఒక తాత్కాలిక భ్రమ మాత్రమే. వాస్తవంలో అది ప్రశాంతత కాదు అది కేవలం నిస్సహాయత, పిరికితనం, మరియు సమాజం పట్ల బాధ్యతారాహిత్యం. నిజమైన ప్రశాంతి అనేది బాహ్య ప్రపంచాన్ని చూసి పారిపోవడంలో లేదు. చెడును చూసినా లోపల చలించకుండా, విద్వేషాన్ని విన్నా కదలకుండా, మనసులో స్థిరత్వాన్ని మరియు వివేకాన్ని అలవరచుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది. మనం బాహ్య ప్రపంచాన్ని పూర్తిగా మార్చలేకపోవచ్చు, కానీ దానికి మనమిచ్చే స్పందనను (=వంజూశీఅంవ) మనమే నియంత్రించుకోవచ్చు. మహాత్మా గాంధీ చెప్పినట్టు మీరు ప్రపంచంలో ఏ మార్పునైతే చూడాలనుకుంటున్నారో, మొదట ఆ మార్పుగా మీరే మారండి. కళ్ళు మూసుకుని, చెవులు మూసుకుని లోకాన్ని బాగు చేయలేము. కళ్ళు తెరిచి ఉంచి, సమాజపు శబ్దాలను వింటూ, అవసరమైనప్పుడు ధైర్యంగా గొంతు విప్పుతూ వివేకంతో, నిర్మలమైన మనసుతో బాధ్యతాయుతంగా జీవించడమే మానవత్వానికి అందం, నిజమైన ప్రశాంతికి మార్గం.

# ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# బెంగాల్‌లో ఫాల్తా రీపోలింగ్‌లో బీజేపీ ఘనవిజయం...

గెలుపొందారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి నాలుగో స్థానానికి పడిపోయి, డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. ఓట్ల లెక్కింపులో దేబాంగ్షు పండాకు 1,49,666 ఓట్లు రాగా, సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీ 40,645 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్‌కు 10,084 ఓట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు కేవలం 7,783 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఫాల్తా ఫలితాలు రెండు విధాలుగా చారిత్రాత్మకమైనవి. 1988లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన తర్వాత ఒక ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానానికి పరిమితం కావడం ఇదే తొలిసారి. అలాగే, 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎంసీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి. ఏప్రిల్ 29న జరిగిన అసలు పోలింగ్‌లో ఫాల్తా నియోజకవర్గంలో తీవ్ర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. బీజేపీ అభ్యర్థికి సంబంధించిన ఈవీఎం బటన్‌పై టేపులు వేయడం, వందలాది మంది ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు సుబ్రతా గుప్తా విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మే 21న ఫాల్తా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్‌కు ఆదేశించింది.

# ఎబోలాపై ఏపీ ప్రభుత్వం దృష్టి..

విమానాశ్రయాల్లోనే ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని అంతర్జాతీయ ప్రయాణాలు జరిగే విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ విమానాశ్రయాలపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ వ్యవహారంపై అన్ని జిల్లాల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎబోలా వైరస్ నియంత్రణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేవలం విమానాశ్రయాలే కాకుండా, రాష్ట్రంలోని ప్రధాన ఓడరేవులు, అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే రోడ్డు మార్గాల్లోనూ నిఘా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రయాణికులలో ఎవరికైనా ఎబోలా వైరస్ లక్షణాలు కనిపిస్తే, వారిని తక్షణమే ఐసోలేట్ చేసి క్వారంటైన్‌కు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండటం అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

# కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..

త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (బీబీఎంపీ) ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అంతేకాకుండా, నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూరులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుని తమ మద్దతును చాటుకున్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో ఇప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ... దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు భారీగా నిధులను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు రూ. 1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ. 1,100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సేకరించాలని తాము కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, అందుకే రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ముందుకొచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. భారీ దిగుబడుల నేపథ్యంలో రైతులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇదివరకే రూ. 4,000 కోట్లు విడుదల చేయగా, తాజా కేటాయింపులతో కలిపి ఆ మొత్తం రూ. 5,800 కోట్లకు చేరిందన్నారు. జిల్లాల వారీగా ఈ పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు పొద్దుతిరుగుడు రైతులను కూడా ఆదుకుంటామని, 25 శాతానికి మించి ఆ పంటను కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

# రేపటి నుంచి 'రైతు గోస – బీజేపీ భరోసా' యాత్ర:

రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పంట వ్యర్థాలు కాల్చడంతో భూమికి కోరిమి



-పంట వ్యర్థాలను కాల్చడం ప్రమాదకరం

-భూసారం దెబ్బతిని దిగుబడిపై ప్రభావం

-నేలకు పర్యావరణానికి తీవ్ర ముప్పు

-కెవికె మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పిల్లి

**రామగిరి మే 24 సూర్య న్యూస్:-** వర్షాకాలం, యాసంగి సీజన్లలో పంటకాలం పూర్తయిన తర్వాత పొలాల్లోని వ్యర్థాలను కాలబెడుతున్నారు. ముఖ్యంగా వరి, పత్తి పంట మొదళ్లను మరో పంట సాగు చేసే ముందు కాల్చి వేసి ఆ బూడిదతోనే దుక్కి దున్నుతున్నారు. అయితే పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా భూసారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గే అవకాశాలు అధికంగా ఉంటాయని రామగిరి ఖిల్లా కృషి విజ్ఞన కేంద్రం మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పిల్లి తెలిపారు. అనేకమంది రైతులకు అవగాహన లేక ఏటా పొలాల్లో వ్యర్థాలను కాల్చి వేస్తున్నారు. దీంతో అగ్ని ప్రమాదాలు కూడా సంభివించిన సందర్భాలూ ఉన్నాయి. జిల్లాలో 2 లక్షలకు పైగా ఎకరాల్లో జిల్లాలోని 14 మండలాల్లో ఏటా సుమారు రెండు లక్షలకుపైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ముఖ్యంగా వరి, పత్తి అధికంగా సాగవుతోంది. వర్షాకాలం, యాసంగిలో పంట కోత తర్వాత వరి, పత్తి మొదళ్లు అలాగే మిగిలిపోతాయి. వీటిని కలియదున్నకుండా కాల్చి వేస్తుండడంతో భూమి ప్రమాదకరంగా మారుతుందని వివరించారు.

**పూర్వంవరికొయ్యలను..** పూర్వం వరి, మొక్కజొన్న, పత్తి మొక్కలను కొడవళ్లతో కోత కోసేవారు. కూలీల సాయంతోనే సాగు నుంచి మొదలు కోత వరకూ పనులు చేసేవారు. యాంత్రీకరణ తర్వాత సాగు నుంచి కోత వరకు యంత్రాలనే వినియోగిస్తున్నారు. వరి, పత్తి పంటల కొయ్యకాళ్లు పైకి కోయడంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దుక్కులు దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు పొలాల్లోనే కాల్చివేస్తున్నారు.

**వ్యర్థాలను కాల్చడంతో నేలకు నష్టం** పొలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న కొయ్యలను కాల్చడం ద్వారా నేలకు నష్టమేనని తెలిపారు. పొలాల్లో వ్యర్థాలను కాల్చడంతో వేడికి భూమి సారం కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భూమికి పీచుగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయని, తద్వారా పంటకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయని, అలాగే సూక్ష్మజీవులు, వానపాములు, జీవరాశులు చనిపోయి ప్రకృతి సమతుల్యత దెబ్బ తింటుందని వివరించారు.

**కలియదున్నితే ప్రయోజనాలు**వరి, మొక్కజొన్న కొయ్యలను నేలలో కలియదున్నితే సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడి వృద్ధి చెందుతుంది. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో కుళ్లి పోషకాలుగా మారిపోతాయి. డీఏపీ వినియోగం సగం వరకు తగ్గుతుంది. వ్యర్థాలను కలియదున్నితే ఎకరాపై టన్ను వరకు ఎరువు తయారు అవుతుంది. మొక్కలకు రెండు శాతం నత్రజని, నాలుగు శాతం ఫాస్పరస్ అదనంగా అందుతుంది. నేలలో కరుగని పోషకాలను పంటకు అనుకూలంగా మార్చుతుంది. నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

**అవగాహన కల్పించినా..** ఏటా సాగు సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా పంట చేలు, పొలాల్లో వ్యర్థాలు, అవశేషాలను కాల్చడం ద్వారా నేల దెబ్బతింటుందని, భూసారం తగ్గుతుందని అవగాహన కల్పించినా రైతుల్లో మార్పు రావడం లేదు. గతంలో మాదిరిగా పశుగ్రాసం అవసరాలు తగ్గిపోవడం, అందుకు తగినట్లుగా హార్వెస్టర్లతో కోతలు చేస్తుండడంతో అవశేషాలు, వరి కొయ్యలను యథేచ్ఛగా కాల్చివేస్తున్నారు.

**కలియదున్నితేనే ప్రయోజనం** సాగు చేసే ముందు అవశేషాలను కలియదున్నితేనే నేలకు, పంటకు ప్రయోజనం ఉంటుంది. వ్యర్థాలను చేను, పొలాల్లోనే కాల్చివేయడంతో అనేక నష్టాలు ఉన్నాయి. ముఖ్యంగా భూమి సారం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. దుక్కులు దున్నే ముందు పొలాలు, చేన్లలో నీళ్లు పెట్టాలి. ఆ తర్వాత డీకంపోజర్ను వేస్తే వ్యర్థాలు, అవశేషాలు పూర్తిగా కుళ్లిపోయి ఎరువుగా మారుతుంది. ఈ విషయంపై కృషి విజ్ఞన కేంద్రం రామగిరిఖిల్లా శాస్త్రవేత్తలు ప్రతీ గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.



## పాలిసెట్ లో జిల్లా ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన వెల్వర్తి విద్యార్థినులు





**వలిగొండ మే 24 సూర్య న్యూస్:** ఇటీవల వెలువడిన పాలిసెట్ పరీక్ష ఫలితాలలో మండలంలోని వెలువర్తికి చెందిన కల్లూరి లాక్షిత 150 మార్కులకు గాను 142 మార్కులు సాధించి జిల్లా ప్రథమ ర్యాంకు, అదే గ్రామానికి చెందిన నారి వర్షిత 150 మార్కులకు గాను 139 మార్కులు సాధించిన జిల్లా ద్వితీయ స్థానం పొందారు. ప్రాథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థినుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## మానసిక వికలాంగులకి మెరుగైన సేవలు అందించాలి

### సీనియర్ సివిల్ కోర్టు జడ్జీ జి.సబిత



**వలిగొండ మే 24 సూర్య న్యూస్:** మండల లీగల్ సర్వీస్ అథారిటీ రామన్నపేట ఆధ్వర్యంలో వలిగొండ మండల పరిధిలోని టేకుల సోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని ఆదివారం రామన్నపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత ఆకస్మికంగా సందర్శించారు. మానసిక వికలాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, వారికి అందిస్తున్న సేవలు, సంరక్షణ విధానాలపై పరిశీలించారు. వారికి నాణ్యతతో కూడిన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అనంతరం ఆశ్రమంలోని రిజిస్టర్లు, సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్లు మీనాక్షి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ధూప దీప నైవేద్య పథకంలోకి నూతన ఆలయాలు

### మంత్రి శ్రీధర్ బాబు, సర్పంచ్ చిందం మహేష్లకు ప్రత్యేక కృతజ్ఞతలు



**రామగిరి మే 24 సూర్య న్యూస్:-** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో, స్థానిక సర్పంచ్ చిందం మహేష్ ప్రత్యేక కృషితో రామగిరి మండలంలోని పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు దేవాలయాలు ధూప దీప నైవేద్య పథకానికి ఎంపికయ్యాయి. గ్రామ పరిధిలోని వాకిలిపల్లి ఫ్లాట్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, పన్నూర్ శ్రీ శివశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలను ఈ పథకంలో చేర్చడం పట్ల అర్చకులు, భక్తులు, గ్రామ ప్రజలు మంత్రి శ్రీధర్ బాబు, సర్పంచ్ చిందం మహేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పథకం అమలులో భాగంగా ఎండోమెంట్ శాఖ ప్రత్యేక అధికారి రాజబాబు ఆదివారం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆలయాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆలయాలలో ధూప, దీప, నైవేద్య కార్యక్రమాలు సక్రమంగా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, ఆలయాల స్థితిగతులు, అర్చకుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య పథకం జిల్లా అధ్యక్షుడు తిరునహరి శ్రీనివాసాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షుడు కోటగడ్డల శివచందర్ శర్మ, మండల అధ్యక్షుడు సంతోష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ పిసిసి అధ్యక్షుడు జన్మదిన సందర్భంగా అన్నదానం పోత్నక్ ప్రమోద్ కుమార్

చిన్నతనం నుండే కాంగ్రెస్ పార్టీ జెండా భుజాన వేసుకున్న మహేష్ కుమార్ గౌడ్

పేద బడుగు బలహీన వర్గాల కాంగ్రెస్ కార్యకర్తల అభ్యున్నతికి కృషి

అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు పార్టీని సమానంగా ముందుకు

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో మరిన్ని పదవులు పొందాలి



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 24 సూర్యా న్యూస్** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలే ఊపిరిగా ప్రజా సేవలో కొనసాగుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్ అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రాయగిరి సహృదయ అనాథ ఆశ్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రథసారథి తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తల ఆశా కిరణం, బడుగు బలహీన వర్గాల స్వరం అందరి మనసులను గెలుచుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, సంఘటన సుజన్ అభియాన్ పాలకుర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోత్నక్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి దశ ఎన్ ఎస్ యు ఐ నుండి యువజన కాంగ్రెస్ లో పని చేస్తూ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షునిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అంచలంచలుగా ఎదుగుతూ నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ జెండా కోసం నిరంతరం తన సేవలు అందిస్తూ ఈనాడు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి రథసారథి కావడం ఆయన అభ్యున్నతికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తల కోసం నిరంతరం శ్రమించి, ముఖ్యంగా పేద మధ్య తరగతి బడుగు బలహీన వర్గాలు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ కి ఎప్పటికప్పుడు కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు సమస్యలు వాళ్లకు రావలసిన పార్టీ పదవులు ప్రభుత్వ పదవులు విషయంలో సమన్యాయంతో సమాలోచనలతో పని చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉన్న నాయకుడు మహేష్ కుమార్ గౌడ్ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై 25 నెలలు నుండి అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్ పార్టీ రెండు జోడెద్దులుగా ప్రజా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకు వెళ్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రచారం చేస్తూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలతో ఫలాలు అందజేస్తూ ముందు సాగుతున్నారన్నారు. బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శ్రీ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీర్వాదంతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని, రానున్న రోజుల్లో మరింత ఉన్నతమైన పదువులను అలంకరించాలని ఆ భగవంతుని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు పడిగెల ప్రదీప్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సామల రవీందర్, పట్టణ అధ్యక్షులు దాకురి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## టీజేయూ అధ్యక్షునిగా పుల్ల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా పెండెం రాజేంద్రప్రసాద్




**కమలాపూర్ మే 24 సూర్య న్యూస్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ (టిజేయు) నూతన కార్యవర్గ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడు పుల్ల రాజేష్ , ఉపాధ్యక్షుడు ఎడ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి పెండెం రాజేంద్రప్రసాద్, కోశాధికారి కుమ్మరి ప్రకాష్, సహాయ కార్యదర్శి పుల్ల సందీప్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పుల్ల రాజేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అధ్యక్ష పదవిని అప్పగించినందుకు యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. “యూనియన్‌లోని ప్రతి ఒక్క సభ్యునికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ,సంఘం అభివృద్ధికి నిరంతరం పాటుపడతాను అని తెలిపారు. సమాజంలో ఉన్న ప్రజా సమస్యలను తోటి జర్నలిస్ట్ మిత్రులతో కలిసి వార్తా కథనాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తాను“ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని జర్నలిస్టులు, యూనియన్ ప్రతినిధులు కొలే దామెదర్ , జుపాక విక్రం, వెంగల విజయ్, కిన్నెర వేణు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.



# గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి





### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి

**దేవీపట్నం మే 24 సూర్య న్యూస్ :-** రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి దేవీపట్నం మండలంలోని చిన భీంపల్లి గ్రామాన్న గిరిజన సమస్యల పరిష్కారానికి సంబంధించి సందర్శించారు. ఈ సందర్భంగా చిన భీంపల్లి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రధానంగా త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలియజేశారు. అదేవిధంగా భూమి సమస్యల విషయంలో ఒకే భూమికి ఇద్దరు రైతుల పేర్లతో పట్టాలు జారీ కావడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని చైర్మన్ కి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎం.పి.పి పాఠశాల భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని గ్రామస్తులు వివరించారు. అనంతరం చైర్మన్ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థులు తాటాకు పాకలో విద్యను అభ్యసిస్తున్నారని తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల నిర్మాణ పనులు ఆగిపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అక్కడ నిల్వ ఉంచిన సిమెంట్ బస్తాలు పూర్తిగా పాడైపోయాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణమని చైర్మన్ కి వివరించారు.అనంతరం పోలవరం నిర్వాసితుల కాలనీ (ఆర్ అండ్ ఆర్) ఇందుకూరు-1 సచివాలయాన్ని చైర్మన్ సందర్శించారు. అక్కడ సచివాలయ అధికారుల విధి నిర్వహణపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకొని, రోజువారీ విధుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని చైర్మన్ సూచించారు.

# ఎంపీ పురందేశ్వరి విస్తృత పర్యటన





### పోలవరం ప్రాజెక్టు పరిశీలన..
### గండి పోశమ్మ ఆలయ నిర్మాణ పనులపై సమీక్ష
### భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశం

**దేవీపట్నం మే 24 సూర్య న్యూస్ :-** రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు (ఎంపీ) దగ్గుపాటి పురందేశ్వరి ఆదివారం దేవీపట్నం మండలంలో విస్తృతంగా పర్యటించారు.

ఈ పర్యటనలో భాగంగా ఆమె తొలుత పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని, పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆలయ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకూడదు..** దూరప్రాంతాల నుండి అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో)తో ఎంపీ ఆరా తీశారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో భక్తులకు సరైన వసతులు లేవనే విషయాన్ని గమనించిన ఆమె అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి, దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను గట్టిగా ఆదేశించారు.

**రహదారుల నాణ్యతపై పరిశీలన..** ఈ పర్యటనలో భాగంగా మండలంలోని పలు రహదారుల పరిస్థితిని కూడా ఎంపీ పురందేశ్వరి పరిశీలించారు. రహదారుల నాణ్యత ఏ విధంగా ఉందనే అంశంపై అధికారులతో చర్చించి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్వహణ సరిగ్గా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు, సొసైటీ అధ్యక్షులు మాగపు బాబురావు, స్టేట్ గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు, మాజీ మండల అధ్యక్షులు మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆలయ చైర్మన్ మలుగుల శ్రీనివాసరెడ్డి, బిజెపి అధ్యక్షులు కారం రామన్న దొర, నియోజకవర్గ బీసీ సెల్ లో ఉపాధ్యక్షులు రేలంగి రాంబాబు, ప్రధాన కార్యదర్శి అయినాల వెంకటేశ్వర్లు, ఐ టి డి పి కార్యదర్శి కుటుంబ రెడ్డి,చౌదరి,పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సీరోల్ మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా మల్లిమీకంటి సురేష్ నియామకం




**సిరోలు మే 24 సూర్య న్యూస్ :-** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీర సురేష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జిల్లా ఇంచార్జ్ భూక్య వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా లోని సీరోల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మల్లిమీకంటి సురేష్ ని నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి ఈ పదవులు అప్పగించిన ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, యువత సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చింతల వెంకటేశ్వర్ రెడ్డి దంపతులకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్** బి.ఆర్.ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల అర్చన - వెంకటేశ్వర్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం యాదాద్రి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద బ్రాహ్మణులచే,వేద ఆశీర్వాదాలు తీసుకున్నారు.

# దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసి ప్రథమ స్థానంలో నిలిచిన తెలంగాణ







### ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క
### 75 లక్షలు గాను ఇప్పటికే 51 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు
### రాష్ట్రవ్యాప్తంగా 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
### రైతుల ఖాతాల్లో రూ.45 వేల కోట్లు జమ
### ధాన్యం తడిసినా కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలించాలి
### ఈ నెలాఖరకు ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి
### తాలు తరుగు పేరిట ట్రేడర్లు మిల్లర్లు రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
### రైతుల వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దు
### మహిళా సంక్షేమ కార్యక్రమాల పట కలెక్టర్లకు దిశా నిర్దేశం

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి ధాన్యం సేకరణ, జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. వేసవి తీవ్రత, హమాలీల కొరత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు జరపడం అభినందనీయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. యాసంగి 2026 సీజన్ కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరపాల్సి ఉండగా, ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు పూర్తయ్యాయని వివరించారు. జిల్లాలలో ధాన్యం సేకరణను వేగవంతం చేసి, ఈ నెలాఖరు నాటికి అన్ని చోట్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. గడిచిన మూడు సీజన్ ల నుండి స్వతంత్ర భారత దేశంలోనే ప్రభుత్వ పరంగా రైతుల నుండి అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన నిలుస్తోందని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో యాసంగిలో 8575 కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి పెద్ద ఎత్తున ధాన్యం సేకరిస్తున్నామని వివరించారు. సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రైతుల ఖాతాలలో రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు జమ చేశామని అన్నారు. ధాన్యం సేకరణ తుది దశకు చేరిన దృష్ట్యా, ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ రైతుల నుండి మిగిలిన ధాన్యం నిల్వలను సైతం వేగంగా కొనుగోళ్ళు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. ఒకవేళ వర్షాలకు ధాన్యం తడిసినా, దానిని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈ మేరకు రైతులకు భరోసా కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే, నేరుగా తమ దృష్టికి తేవాలని అన్నారు. తాలు, తరుగు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. మరో వారం రోజుల పాటు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పంట కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు.మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వరి పంట కోసిన అనంతరం కొంతమంది రైతులు వరి కోయ్యలకు నిప్పు పెడుతున్నారని, ఇది పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు భూసారం దెబ్బతింటుందని, ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఏర్పడుతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వరి కోయ్యలకు నిప్పు పెట్టకుండా రైతులకు గ్రామగ్రామాన విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, చిత్రారామచంద్రన్, దివ్య దేవరాజన్ తదితరులు ఈ నెల 25 నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే మహిళా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోజువారీగా చేపట్టాల్సి ఉన్న కార్యక్రమాలను తెలియజేస్తూ, మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్వహించాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, సివిల్ సప్లై అధికారిణి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## వనరుల దోపిడీ కోసమే యుద్ధాలు

### అమెరికా సామ్రాజ్యవాద విధానాలపై ఇస్కఫ్ నేతల విమర్శలు




**కర్నూలు మే 24 సూర్య న్యూస్ :-** ప్రపంచవ్యాప్తంగా ఆయిల్, గ్యాస్, ఖనిజ వనరుల దోపిడీ లక్ష్యంగా సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలకు పాల్పడుతున్నాయని ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్‌రావు ఆరోపించారు. యుద్ధాలు మానవాళికి వినాశనమే తప్ప అభివృద్ధికి దోహదం చేయవని, శాంతి ద్వారానే ప్రపంచ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కర్నూలులోని ప్రజా వైద్యశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఇస్కఫ్ ఆధ్వర్యంలో "యుద్ధాలు వద్దు.. శాంతి కావాలిఅనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు.సమావేశానికి బి.సుంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తుంగ శ్రీధర్‌రావు మాట్లాడుతూ మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో కోట్లాది మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసం అమెరికా వంటి దేశాలు కుట్రలు పన్ని యుద్ధాలను రెచ్చగొడుతున్నాయని విమర్శించారు.ఇతర దేశాల సహజ సంపదలపై కన్నేసిన అమెరికా, ఆయా దేశాల్లో అస్థిరత సృష్టిస్తూ యుద్ధాలకు కారణమవుతోందని ఆరోపించారు.యుద్ధాల వల్ల ప్రాణనష్టం, ఆర్థిక సంక్షోభం, ప్రజల నిరాశ్రయత్వం పెరుగుతున్నాయని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.రామాంజనేయులు మాట్లాడుతూ వెనిజులా క్యూబా, అరబ్ దేశాల్లోని ఆయిల్, గ్యాస్ వనరులపై అమెరికా ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ దౌర్జన్యాలకు పాల్పడుతోందని విమర్శించారు.పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. సీనియర్ లెక్చరర్ సి.రమేష్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మత ఆధిపత్యం, వనరుల దోపిడీ, రాజకీయ ఆధిపత్యాల కోసమే యుద్ధాలు కొనసాగుతున్నాయని అన్నారు.శాంతి ఉంటే యుద్ధాలు ఉండవు యుద్ధాలుంటే శాంతి ఉండదు అని వ్యాఖ్యానించారు.సమావేశంలో ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి వసంతకుమార్, సీనియర్ అడ్వకేట్ జి.నాగశేషయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునెప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లా? స్థలమా?.. టైర్-2 నగరాల్లో పెట్టుబడికి ఏది మేలు?

దేశంలోని లక్నో, జైపూర్, ఇండోర్, విశాఖపట్నం వంటి టైర్-2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా విస్తరిస్తోంది. మెట్రో నగరాలతో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరలకే ఆస్తులు లభిస్తుండటంతో పెట్టుబడిదారులు ఇటువైపు చూస్తున్నారు. ఇలాంటి తరుణంలో పెట్టుబడి పెట్టాలనుకునేవారికి ఓ కీలకమైన ప్రశ్న ఎదురవుతోంది.. ప్లాట్లు కొనాలా లేక అపార్ట్‌మెంట్ తీసుకోవాలా?

**దీర్ఘకాలిక లాభాలకు ప్లాట్లు** దీర్ఘకాలికంగా అధిక లాభాలు ఆశించేవారికి ప్లాట్లు మంచి ఆప్షన్‌గా కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలు చేపడుతున్న ఎక్స్‌ప్రెస్‌వేలు, రింగ్ రోడ్లు, కొత్త విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కల్పనతో ప్లాట్ల ధరలు వేగంగా పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కేవలం 2-4 ఏళ్లలో 25% నుంచి 100% వరకు ధరలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తమకు నచ్చినట్టుగా ఇల్లు కట్టుకునే స్వేచ్ఛ ఉండటం కూడా ప్లాట్ల వైపు ఆకర్షిస్తోంది.

**తక్షణ ఆదాయానికి అపార్ట్‌మెంట్లు** మరోవైపు, వెంటనే ఇంట్లోకి మారాలనుకునేవారికి, అద్దె ఆదాయం ఆశించేవారికి అపార్ట్‌మెంట్లు సరైనవిగా నిలుస్తున్నాయి. ఉద్యోగాలు చేసేవారు, చిన్న కుటుంబాలు ఈ ఆప్షన్‌ను ఎక్కువగా ఎంచుకుంటున్నాయి. క్లబ్‌హౌస్, సెక్యూరిటీ, పార్కులు వంటి సౌకర్యాలు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. నిర్వహణ కూడా సులువుగా ఉండటం, త్వరగా అద్దెకు ఇవ్వగలగడం వంటివి అపార్ట్‌మెంట్లకున్న సానుకూల అంశాలు.

**నిపుణుల మాట** ఈ రెండింటిలో ఏది గొప్పది అనే దానికి ఒకే సమాధానం లేదని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. "త్వరగా డబ్బు సంపాదించాలనుకునేవారు, అద్దె ఆదాయం కోరుకునేవారు అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, దీర్ఘకాలంలో ఎక్కువ రాబడిని ఆశించే పెట్టుబడిదారులు ప్లాట్లనే ఎంచుకుంటున్నారు" అని నిపుణులు వివరించారు. చివరిగా, ప్లాట్ లేదా అపార్ట్‌మెంట్ ఎంపిక అనేది పూర్తిగా వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలు, పెట్టుబడి పెట్టగల సమయం, రిస్క్ తీసుకునే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల, పెట్టుబడిదారులు తమ అవసరాలను బేరీజు వేసుకుని, స్థానిక పరిస్థితులను అంచనా వేసి సరైన నిర్ణయం తీసుకోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

# తక్షణమే తుమ్మలచెరువుకు ఉన్న రెండు తూముల షటర్లు రిపేరు చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్.

**అశ్వాపురం మే 22 సూర్య న్యూస్:-** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోగల సుప్రసిద్ధ కాకతీయ కాలంనాటి తుమ్మలచెరువు పేరుగాంచింది. సంవత్సరాలుగా వరి పంటకు కేంద్ర బిందువుగా సాగునీటి వనరుగా ఉన్న చెరువుకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని స్థానిక చుట్టుపక్కల గ్రామాల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం గత రెండు సంవత్సరాలుగా చెరువుకు ఉన్న పెద్ద తూము చిన్న తూము ల వద్ద సంక్లిష్ట సమస్యల వలన ఈ ప్రాంత రైతాంగం పలు అవస్థలు పడుతూ కాలం వెళ్ళదిస్తున్నారు. ప్రతి సంవత్సరం నీటి సామర్థ్యం 24 అడుగులు దాటి నిండుకుండలా మారి తూములపై నుండి అలుగు పారుతూ చెరువు చుట్టూ ఉన్న కట్టలు దెబ్బతింటాయేమోనని రైతులు భయపడుతూ చెరువులు రక్షించుకుంటూ వస్తున్నారు. పెద్ద తూము చిన్న తూము షట్టర్లు గత రెండు సంవత్సరాలుగా బిగుసుకుపోయి పైకి క్రిందికి ఆడక పోవడం వలన చిన్న తూము పెద్ద తూము ల చెరువు పైకి లేపాలి అన్న క్రిందకి దించాలన్న స్థానిక రైతాంగానికి నీరు ఇవ్వాలన్న పలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఈ స్థితిలో అట్టి తుమ్మలచెరువును సిపిఎం పార్టీ అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఏఐకేఎస్ ఆదివారం నాడు రైతుల తరఫున సందర్శించి తుమ్మల చెరువు వద్ద ఉన్న ప్రస్తుత పరిస్థితులను సర్వే అంచనా వేసి వెంటనే సెటర్లు రిపేర్ చేయాలని లేని యెడల రైతులు నష్టపోవాల్సి వస్తుందని వర్షాకాలం ప్రారంభమైతే రిపేర్లు చేయడం కష్టంగా మారి రైతుల నష్టపోవాల్సి వస్తుందని ఇరిగేషన్ అధికారులు స్పందించి పెద్దతుము చిన్న తోములను రిపేర్ చేయించి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంటలకు నీరు అందించాలని ఆర్ అండ్ బి రోడ్డు నుంచి తుమ్మలచెరువు వరకు బిటి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఇరిగేషన్ అధికారులు చెరువుకు ఉన్నటువంటి అనుబంధ పంట కాలువలను పూడికలు తీయించి రిపేర్లు చేయించాలని తెలంగాణ రైతు సంఘం అశ్వాపురం మండల కమిటీ డిమాండ్ చేస్తున్నది.తుమ్మలచెరువును సందర్శించిన వారిలో అశ్వాపురం మండల రైతు సంఘం అధ్యక్షులు బద్దం సెంబిరెడ్డి మండల కమిటీ సభ్యులు మంగివెంకటరమణ ఆవుల సుధాకర్ పినికేసు సుధాకర్ రెడ్డి స్వర్గం వీరరాఘవులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దండి రాములు తదితరులు తుమ్మలచెరువును సందర్శించిన వారిలో ఉన్నారు.



# గిరిజన గ్రామాలలో దళారుల హవా..
# అమాయక రైతుల జీవితాలతో ఆట





## గిరిజన రైతుల కన్నీళ్ల పై దళారుల దోపిడీ రాజ్యం..!
## అధిక వడ్డీల ఉచ్చులో గిరిజన భూములు దళారుల చేతుల్లోకి ..!
## పంట పండించిన రైతు రోడ్డున..
## కోట్లకు పడగలెత్తిన దళారులు

**అశ్వారావుపేట ప్రతినిధి మే 24 సూర్య న్యూస్ :-** అశ్వారావుపేట మండల పరిధిలోని వినాయకపురం, నారాయణపురం, గుమ్మడవల్లి, పండువారిగూడెం దబ్బాతోగు తిరమాలకుంట రెడ్డిగూడెం గ్రామాలలో గిరిజన రైతుల పరిస్థితి రోజు రోజుకు దారుణంగా మారుతోంది. కష్టపడి వ్యవసాయం చేసి కుటుంబాలను పోషించుకుంటున్న గిరిజన ప్రజలను దళారులు టార్గెట్ చేస్తూ ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ దున్నించడం దగ్గర నుండి విత్తనాలు, ఎరువులు, మందులు, పెట్టుబడులు అన్నీ తమ ద్వారానే అందిస్తూ రైతులను అప్పుల వలలోకి లాగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. “ఇప్పుడు డబ్బు తీసుకోండి పంట వచ్చిన తర్వాత ఇవ్వండి” అంటూ నమ్మకం కల్పించి తర్వాత 10 నుండి 15 శాతం వరకు అధిక వడ్డీలు వసూలు చేస్తూ గిరిజన కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అధిక వడ్డీలు కట్టలేక చివరకు తమ పొలాలను కూడా 10 నుండి 20 సంవత్సరాల పాటు కౌలు రూపంలో దళారుల చేతుల్లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు చెబుతున్నారు. గిరిజన భూములనే దళారులు సాగు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తుంటే, అసలు భూమి యజమాని అయిన అమాయక రైతు మాత్రం రోడ్డు మీద పడే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తమవుతోంది. వేరుశెనగ పొగాకు, జీడిగింజలు, వడ్లు, పుచ్చకాయ వంటి పంటలను మార్కెట్ ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తూ గిరిజన రైతులను మోసం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఎటువంటి బిల్లులు లేకుండా అర్ధరాత్రి సమయంలో వాహనాల్లో లోడింగ్ చేసి రహస్యంగా పంటను తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

గ్రామాల్లో సాధారణ స్థితిలో ఉన్న కొంతమంది దళారులు ఇప్పుడు భారీ స్థాయిలో ఆస్తులు సంపాదించారని, ఎక్కడ లేని విధంగా భూములు, ఇళ్లు, వాహనాలు కూడబెట్టుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు దళారుల ఆస్తి వివరాలు, బ్యాంకు అకౌంట్లు, అక్రమ లావాదేవీలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గిరిజన అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ దోపిడీపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక దర్యాప్తు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. త్వరలో ఈ దళారుల పూర్తి వివరాలు, ఆస్తుల వివరాలు, వడ్డీ వ్యాపారాల సమాచారం సేకరించి ప్రజలకూ అధికారులకూ కళ్లకు కట్టినట్టు చూపిస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

# నేటి నుంచి రైతు గోస బీజేపీ భరోసా పాదయాత్ర
## జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నేటి నుంచి రైతు గోస బీజేపీ భరోసా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు ఊటుకూరి అశోక్ గౌడ్ తెలిపారు. ఆదివారం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎం ఎన్ ఆర్ గార్డెన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ మాట్లాడుతూ, మే 25వ తేదీ నుండి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతు గోసా – బీజేపీ భరోసా పేరిట యాత్ర చేపట్టబోతున్నా మన్నారు. అందులో బాగంగా నేడు గజ్వేల్ నుండి యాదాద్రి భువనగిరి జిల్లా మీదగా వివిధ మండలాలను సందర్శిస్తూ నేరుగా రైతులతో మాట్లాడి ధాన్యం ఎంత కొనుగోలు చేస్తారో తెలుసుకుంటామన్నారు. రెండు రోజుల పాటు రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము రైతులతో మాట్లాడిస్తా మని, తమకు కావాల్సింది రైతుల సంక్షేమమని తెలిపారు. అన్నదాతలకు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని వేముల అశోక్ డిమాండ్ చేశారు.కార్యక్రం లో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులూ గోలి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 26 న రైతు గోసా – బీజేపీ భరోసా' రోజున గజ్వేల్ నుండి మన జిల్లా మీదగా జరుగుతున్న యాత్రను లో అధిక సంఖ్యా లో రైతులతో ముఖాముకి కార్యక్రమాని విజయవంతం చెయ్యాలి అన్నారు ఈ కార్యక్రమం లో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి ,రాష్ట కార్యవర్గ సభ్యులు మాయ దశరథ , మాజి రాష్ట కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి , భువనగిరి పట్టాన అధ్యక్షుడు రత్నపురం బలరాం , పాదరాజు ఉమా శంకర్, బబ్బూరి సురేష్, మండల అధ్యక్షుడు చిరిక సురేష్ రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో ఘనంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ జన్మదిన వేడుకలు



**కమలాపూర్ మే 24 సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ జన్మదిన వేడుకలు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కేంద్రంలోని ముఖ్య నేతలతో పాటు, మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. బొమ్మ మహేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఈ సందర్భంగా హనుమకొండ డిసిసి (ఐజజ) ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్లు ప్రత్యేకంగా మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ ఐక్యమత్యంతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ జన్మదిన వేడుకల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్, డాక్టర్ మౌటం కుమారస్వామి , తడక శ్రీకాంత్ , కమలాపూర్ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, బొల్లం రాజిరెడ్డి, కనక రత్నం, మార్కెట్ డైరెక్టర్ కృష్ణమూర్తి, మండల పరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు , పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి కి ఆత్మీయ సన్మానం

## వేం నరేందర్ రెడ్డి అందరివాడు-నాయిని
## వరంగల్ అభివృద్ధిలో వేం నరేందర్ రెడ్డిది కీలక పాత్ర
## ఓరుగల్లు అభివృద్ధికి వేం నరేందర్ రెడ్డి నిధులు, సమయం వెచ్చిస్తున్నారు- ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



**హనుమకొండ టౌన్ 24 సూర్య న్యూస్:-** హంటర్ రోడ్డులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ఆత్మీయ సన్మాన సభ ఆదివారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలందరూ వేం నరేందర్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నేతలు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని కొనియాడారు.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి లేకుంటే జిల్లాకు సగం నిధులు కూడా వచ్చేవి కావని అన్నారు. గతంలో దుర్మార్గుల చేతిలో ఇరవై ఏళ్ల అభివృద్ధి వెనక్కు పోయిందని విమర్శించారు. అయితే రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా నుంచి కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం, కరీంనగర్ వంటి పెద్ద నాయకులు ఉన్న జిల్లాల్లో కూడా సాధించని స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని, అదే తరహాలో వరంగల్ జిల్లాకు అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరారు.పార్టీ కోసం కష్టపడ్డ వారికి భవిష్యత్తులో సముచిత గౌరవం, పదవులు కల్పించాలని సూచించిన ఆయన, తనకు ఎమ్మెల్యే టికెట్ రావడంలో వేం నరేందర్ రెడ్డి పాత్ర కీలకమని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా నేతలందరం ఐక్యంగా ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. “వేం అన్న కొందరివాడు కాదు అందరివాడు” అంటూ ఆయనపై తన అనుబంధాన్ని వ్యక్తం చేశారు. అలాగే రాజ్యసభ సభ్యునిగా ఎంపిక చేసిన ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి జిల్లా తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఓరుగల్లు అభివృద్ధిపై వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. ఎయిర్‌పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రేటర్ వరంగల్ అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన సమయం కేటాయించి పనిచేస్తున్నారని అన్నారు.ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ సోషల్ మీడియాలో కాక్రోచ్ పార్టీ అనే పదం పుట్టగానే బీజేపీ భయపడిందని విమర్శించారు. వరంగల్‌ను సెకండ్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దడంలో వేం నరేందర్ రెడ్డి తెరవెనుక కీలక సహకారం అందిస్తున్నారని తెలిపారు. తనకు రాజకీయ అవకాశం రావడంలో కూడా ఆయన పాత్ర ఎంతో ఉందని గుర్తుచేశారు.డీసీసీ అధ్యక్షుడు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ నగరాలను ఏకీకృత దృక్పథంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు వేం నరేందర్ రెడ్డి సహకారం మరింత అవసరమని అన్నారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ మంచికి ఓపిక, తప్పు జరిగితే ఆగ్రహం చూపే స్వభావం వేం నరేందర్ రెడ్డిదని అన్నారు. సీఎం వద్దకు వెళ్లే ముందే చాలామంది వేం వద్దకు వెళ్లే పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. 2004 నుంచి తనకు ఆయనతో పరిచయం ఉందని, తన రాజకీయ ఎదుగుదలలో సోదరునిలా సహకరించారని గుర్తుచేశారు. ఓరుగల్లు బిడ్డగా ఆయన ఢిల్లీ స్థాయిలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పార్టీ కాదని, బడుగు బలహీన వర్గాలందరి పార్టీ అని స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అప్పట్లో చంద్రబాబు చాలా కఠినంగా వ్యవహరించేవారని, టీడీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో మాట్లాడకుండా చూసేవారని గుర్తుచేశారు. కానీ వేం నరేందర్ రెడ్డి మాత్రం ఎప్పుడూ ఆప్యాయంగా మాట్లాడేవారని చెప్పారు. తమ ఇద్దరికీ ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయ ప్రత్యర్థి కావడంతో మరింత సాన్నిహిత్యం ఏర్పడిందని సరదాగా వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పరిపాలన విజయవంతం కావడంలో వేం నరేందర్ రెడ్డి సలహాలు కీలకమని తెలిపారు. వరంగల్ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. “వేం అన్న నోట్లో నాలిక లేనట్టే ఉంటారు కానీడ సరైన సబ్జెక్ట్ దొరికితే అనర్గళంగా మాట్లాడతారు. రాజ్యసభలో కూడా అలాగే రాణించాలి” అంటూ ప్రశంసించారు.రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న కాంగ్రెస్ కార్యకర్తల పోరాట ఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా అనేక ప్రాంతాల్లో తనను అభిమానించే ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడామని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా స్వేచ్ఛాయుత పాలన అందిస్తోందని పేర్కొన్నారు.బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ నిజమైన వేదిక అని, ఆ భావజాలానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. ఓరుగల్లు అభివృద్ధి కోసం రూ.2200 కోట్లతో 11 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో జనగామ నియోజకవర్గానికీ విస్తరిస్తామని తెలిపారు. కింది స్థాయి కార్యకర్తల కృషివల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే గ్రేటర్ వరంగల్ ఎన్నికలు కొత్త సవాల్ అని, దేశంలోనే జీడబ్ల్యూఎంసీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాజకీయాల్లో ఎదుటివారి మాట వినే ఓపిక, సున్నితత్వం అవసరమని, అదే తన విజయానికి కారణమని పేర్కొన్నారు. రాజకీయాల్లో అవకాశాలు పొందిన పది శాతం మంది నేతలు మిగతా తొంభై శాతం కార్యకర్తలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.జూలై నెలలో మామునూర్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే అవకాశముందని, జూన్‌లో టెండర్లు పూర్తవుతాయని వెల్లడించారు. త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు టెండర్లు పిలుస్తామని, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో కొంత వెనుకబడ్డామని అంగీకరించారు. రాబోయే 25 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు దేవుడు ఇచ్చిన సోదరుడు, ప్రాణ స్నేహితుడని పేర్కొన్న వేం నరేందర్ రెడ్డి, గత ఏడు ఎనిమిదేళ్లలో ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని దగ్గరగా చూశానన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చే ప్రతి ఆదేశాన్ని నమ్మకంగా అమలు చేస్తానని స్పష్టం చేశారు.

# దయ్యం బండ తండా గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం
## డాక్టర్ చావా రాజ్ కుమార్
## 139వ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ
## ప్రజలకు బిపి షుగర్ న్యూరోపతి బిఎండి పరీక్షలు
## 200 మందికి ఉచితంగా పరీక్షలు మందులు పంపిణీ
## శ్రీ ఆర్కే హాస్పిటల్ నిర్వాహకులకు అభినందనలు తెలిపిన గ్రామస్తులు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్** భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ తారక్ డయాగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో 139వ ఉచిత మెగా వైద్య శిబిరం తూర్కపల్లి మండలం దయ్యం బండ తండా గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా జనరల్బి ఫిజీషియన్ డాక్టర్ చే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద శిబిరం నుండి గ్రామ ప్రజలకు బిపి, షుగర్, న్యూరోపతి, బిఎండి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో గ్రామ ప్రజలకు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చావా రాజ్ కుమార్ గ్రామ ప్రజలకు బీపీ షుగర్ థైరాయిడ్ మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన లక్షణాలు, వాటి నివారణకు తీసుకొని వలసిన తగు జాగ్రత్తలను గురించి వివరించారు, ఈ ఉచిత వైద్య శిబిరంలో గ్రామ సర్పంచ్ వాంకుతోడు సుధాకర్ నాయక్, ఉప సర్పంచ్ నవీన్ నాయక్, వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామానికి విచ్చేసి గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందని, స్పెషలిస్టె వైద్యులు గ్రామాలకు వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం వలన పేద ప్రజలకు చాలా అవసరం అవుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు అందరూ కూడా సద్వినియోగ పరుచుకోవాలి అని తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ తెలియజేశారు.

# తిరుమలలో బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు... దర్శనానికి 30 గంటలు

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూలైన్లు బయటకు ఏకంగా బాట గంగమ్మ ఆలయం వరకు పొడిగించారు. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టీటీడీ అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు.



టీటీడీ గణాంకాల ప్రకారం, నిన్న మే 23వ తేదీ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే రోజున శ్రీవారి హుండీకి రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

# యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతం

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ టౌన్ మే 24 సూర్య న్యూస్:-** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష2026ను జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.ఆదివారం నిర్వహించిన పరీక్షల సందర్భంగా హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్ల తనిఖీ, సంబంధిత యాప్ ద్వారా నమోదు ప్రక్రియ, భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అలాగే అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలను తనిఖీ చేశారు. అదేవిధంగా యూపీఎస్సీ సెంట్రల్ ఇన్స్పెక్షన్ అధికారి శుభం గాడ్, రాష్ట్ర స్థాయి ఆబ్జార్వర్ టిజిఎన్ పిడిసిఎల్ సిఎండి కె, వరుణ్ రెడ్డిలు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. హనుమకొండలోని ఎస్సార్ నేషనల్ హై స్కూల్, ములుగు రోడ్డులోని శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భద్రకాళి దేవాలయం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, లాల్ బహుదూర్ కళాశాల, అశోక జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు.

పరీక్షా కేంద్రాల్లో నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ పరీక్ష ప్రారంభానికి ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించినట్లు పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో 4,075 మంది అభ్యర్థుల కోసం పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఉదయం జరిగిన మొదటి సెషన్‌లో 2,762 మంది అభ్యర్థులు హాజరుకాగా, 1,313 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. హాజరు శాతం 67.78గా నమోదైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్‌లో 2,749 మంది హాజరుకాగా, 1,326 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సెషన్‌లో హాజరు శాతం 67.46గా నమోదైనట్లు వెల్లడించారు.ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలోనూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా



పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.పరీక్షల నిర్వహణలో సమన్వయంతో పనిచేసిన కేంద్ర నిర్వాహకులు, రూట్ అధికారులు, పోలీసు శాఖ, విద్యాశాఖ సిబ్బంది, ఇతర శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెంట్రల్ ఇన్స్పెక్షన్ అధికారి శుభం గాడ్, రాష్ట్ర స్థాయి ఆబ్జార్వర్ టిజిఎన్ పిడిసిఎల్ సిఎండి కె, వరుణ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్స్, తహసీల్దార్లు, రూట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా సెక్రెటరీగా దికొండ బిక్షపతి



**హనుమకొండ టౌన్ మే 24 సూర్య న్యూస్:-** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా సెక్రెటరీగా దికొండ బిక్షపతిని నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేయడమైంది. ఈ సందర్భంగా దికొండ బిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల, ఉద్యమకారుల ఆకాంక్షను, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్ వామ్ కొరకు ఆత్మ గౌరవం సంక్షేమం కొరకు కృషి చేస్తానని అన్నారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ కు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు భాషా బోయిన రవీందర్ యాదవ్ కు, హన్మకొండ జిల్లా అధ్యక్షులు చిలువేరు రమేష్ కు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

# ఐపీఎస్ పాఠశాల సమీపంలో పంట కొయ్యలకు నిప్పు

### తన సిబ్బందితో వెంటనే మంటలను ఆర్పి వేసిన సిఐ ఏ. మహేందర్

### తప్పిన పెను ప్రమాదం



**హనుమకొండ టౌన్ మే 24 సూర్య న్యూస్:-** హసన్పర్తి మండల కేంద్రం పెంబర్తి సమీపంలోని ఐపీఎస్ పాఠశాల సమీపంలో సాయంత్రం 6:30 గంటలకు పంట కొయ్యలకు నిప్పంటుకుందన్న సమాచారం అందుకున్న హసన్పర్తి పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ సకాలంలో స్పందించి వెంటనే తన పోలీసు, బ్లూ కోల్ట్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో పెద్ద అగ్ని ప్రమాదాన్ని నివారించినట్లయింది. అగ్ని ప్రమాద కారణ స్పష్టత కోసం ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. అవసరమైతే సంబంధిత అధికార యంత్రాంగాల సమన్వయం ద్వారా మరింత చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా సిఐ ఏ. మహేందర్ మాట్లాడుతూ తేలికగా ఉండే ప్లాస్టిక్ వస్తువులు,పంట కోసిన తర్వాత ఎండు గడ్డి,పంట కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల మంటలు క్షణాల్లో వ్యాపించి ఎకరాల కొద్ది పంట పొలాలు, సమీపంలోని ఇండ్లు, మూగ జీవాలు తగలబడతాయని విద్యుత్తు ప్రమాదాలు జరిగే అవకాశం అవకాశం ఉందని అన్నారు. అంతేకాకుండా భూసారం తగ్గి వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. మంటలు చేలరేగే సమయంలో మంటల చుట్టూ స్థానికుల సహాయంతో ట్రాక్టర్లతో దున్నిస్తే మంటలు అదుపు చేయవచ్చునని అన్నారు. ప్రమాద సమయంలో తక్షణ సహాయం కోసం స్థానిక పోలీస్ స్టేషన్ కు 871 268 5015 లేదా అత్యవసర హెల్ప్లైన్ 100 కి,ఫైర్ స్టేషన్ 101 కి కాల్ చేయాలని అన్నారు.

# స్వర్ణ గిరిలో వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం



**వైభవంగా జరిగిన శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవం**
**33 కోట్ల దేవతలు కొలువుదీరిన గోపృష్ట దర్శనం**
**వేయి నామాల శ్రీ వెంకటేశ్వర స్వామికి సహస్రనామార్చన**
**లోక కళ్యాణం కోసం శ్రీ సుదర్శన నారసింహ హవనం**
**శ్రీ స్వామివారి మహాన్న ప్రసాదాన్ని స్వీకరించిన 5000 మంది భక్తులు**
**గోవింద నామ స్మరణలతో తిరువీధి ఉత్సవ సేవ**
**సహస్ర దీప కాంతుల మధ్య బంగారు ఊయలలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు**
**శ్రీస్వామివారిని నైనానంద కరంగా దర్శించుకున్న భక్తులు**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణ లతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి, వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఆదివారం 5000 మంది భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణ లతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.



# రోడ్డు భద్రతకు బుడుగు బజార్ యువత చేయూత

### డివైడర్ వద్ద సిగ్నల్ ఏర్పాటు.




**అశ్వాపురం మే 24 సూర్య న్యూస్ :-** మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి కార్యాలయం ఎదుట గల రోడ్డు డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బుడుగు బజార్ యువత ఆదివారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిగ్నల్ రేడియం స్టిక్కరింగ్‌తో కూడిన పోల్ను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహనదారులకు డివైడర్ స్పష్టంగా కనిపించేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు యువత తెలిపారు. ఇటీవల అక్కడ వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో యువత సామాజిక బాధ్యతతో స్పందించి స్వంత ఖర్చులతో హెచ్చరిక పోల్ను ఏర్పాటు చేయడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. రోడ్డు భద్రతపై యువత చూపిన చొరవను పలువురు అభినందించారు.

# నిప్పులకొలిమిలా ఆంధ్రప్రదేశ్... తూర్పుగోదావరిలో 48.3 డిగ్రీలతో సీజన్ రికార్డు

ఆంధ్రప్రదేశ్‌లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాడు. ఆదివారం (మే 24) తూర్పుగోదావరి జిల్లా చిట్యాల వద్ద ఈ సీజన్‌లోనే అత్యధికంగా 48.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రాబోయే మూడు రోజుల పాటు ఇదే తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. ఆదివారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటాయి. తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురంలో 48.3, ఉండ్రాజవరంలో 48.1 డిగ్రీలు నమోదవగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి, ఇరగవరం, తణుకులో 48.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోనూ 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా కుక్కునూరులో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల తీవ్రత కనిపించింది.

# జగిత్యాల జిల్లా గోపా ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల

**జగిత్యాల జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్ :-** జగిత్యాల జిల్లా కేంద్రం లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో 90% పైగా మార్కులు సాధించిన 100 మంది గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు జగిత్యాల జిల్లా గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోందన్నారు. పేదరికాన్ని జయించడానికి, కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించడానికి చదువు మాత్రమే మార్గమని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, లక్ష్యసాధన, కష్టపడి చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ దశలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వంటివని, ఈ దశలో సాధించిన విజయాలు జీవితంలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్తాయని చెప్పారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, వారి వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. విద్యార్థుల విజయానికి కుటుంబ సహకారం, గురువుల మార్గదర్శనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లకు ఎక్కువ సమయం కేటాయిస్తూ చదువుపై దృష్టి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమాజ అభివృద్ధికి విద్యావంతులైన యువత అవసరమని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని అన్నారు. అంతేకాకుండా, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. ఇలాంటి ప్రతిభా పురస్కారాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మంది ఉన్నత ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. చివరగా, విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకుని నిరంతరం శ్రమిస్తే తప్పకుండా విజయాన్ని అందుకుంటారని, “కష్టం చేసిన వారికి విజయం ఖాయం” అనే నమ్మకంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చెక్కళ్ల మధుసూదన్ గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ లు యల్మకంటి మీరయ్య గౌడ్, కళ్యాణ్ చక్రవర్తి గౌడ్, జిల్లా ఆర్డీవో మధుసూదన్ గౌడ్, అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్, జగిత్యాల జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అశ్వాపురం మే 24 సూర్య న్యూస్:-** మండలంలోని జగ్గారం, గొందిగూడెం గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకొని ఆదివారం గృహప్రవేశాలు చేస్తున్న సందర్భంగా లబ్ధిదారులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగ్గారంలో ఆవుల సరిత, తాటి వెంకటమ్మ, గొందిగూడెంలో కొమరం నాగమణి, కంచర్ల దేవి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని అ పేద ప్రజలు సొంతింటిలో సంతోషంగా జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, మాదినేని రాంబాబు, బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ లు యేనిక ఉషారాణి, జిమ్మా ఝాన్సీ, ఉపసర్పంజ్ శీలం సంజీవ రెడ్డి, తూము వీరరాఘవులు, ఆవుల రవి, బరాజు సంపత్, చుంచు ఏకాంబరం, సోడే వెంకటేశ్వర్లు, గుండ్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గణపారపు వెంకన్న, గొల్లపల్లి నరేష్,తాటి రాంబాబు , వేముల విజయ్, జిమ్మా జంపయ్య, కంబాల వెంకన్న, బట్టి వెంకన్న, కంబాల వెంకన్న, ఆవుల వెంకన్న, భూక్యా శివ నాయక్, పర్సబోయిన సోమలింగం, తహసిల్దార్ సూర్యప్రకాష్ , ఎంపీడీవో ముత్యాలరావు, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

# అక్రమంగా పశువులు తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు పశువుల స్వాధీనం

### అశ్వాపురం సి ఐ అశోక్ రెడ్డి



**అశ్వాపురం మే 24 సూర్య న్యూస్ :-** అశ్వాపురం మండలం పాములపల్లి నుండి అక్రమంగా 3 పశువులను పాల్వంచకు తరలిస్తున్న సమయంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పాల్వంచ రూరల్ పాండురంగాపురం కి చెందిన కుర్ర హనుమాన్, బానోతు సురేష్, భూక్య సాగర్ అనే ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రామించారు. అక్రమంగా తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని సంరక్షణార్థం గోశాలకు తరలిం చారు పశువులను రవాణా చేసేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత అనుమతి పత్రాలు, రవాణా పత్రాలు వెంట ఉంచుకోవాలి. అక్రమంగా పశువుల రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందని

# రాష్ట్రవ్యాప్తంగా యువజన, క్రీడా వారోత్సవాలు





**స్పోర్ట్స్ బ్యూరో మే 24 సూర్య న్యూస్ :-** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన, క్రీడల శాఖ నిర్వహించిన యువజన, క్రీడల వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా జరిగాయి. మే 18 నుంచి 23 వరకు జరిగిన ఈ 6 రోజుల కార్యక్రమాలు యువతలో క్రీడా స్ఫూర్తి, నాయకత్వం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక బాధ్యత మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచాయి. మే 18: ఫిట్, యాక్టివ్ తెలంగాణ పేరిట మారథాన్‌లు, యోగా, జుంబా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మే 19: కెరీర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెషన్లు, అగ్నివీర్ అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి.మే 20: యువజన నాయకత్వ సమ్మిట్, యువజన పార్లమెంట్ ద్వారా సామాజిక అంశాలపై చర్చలు నిర్వహించారు. మే 21 ప్లే, పార్టిసిపేట్ క్రీడా దినోత్సవంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. మే 22 సర్వ్, సపోర్ట్ కార్యక్రమంలో పరిశుభ్రత కార్యక్రమాలు, శ్రమదానం చేపట్టారు. మే 23 ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సులు, జాబ్ మేళాల విజయాలు ప్రదర్శించారు. ఉద్యోగ మేళాల ఫలితాలు:దాదాపు 40 వేల మంది యువత నమోదు 22 వేల మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరు

11,200 మంది షార్ట్‌లిస్ట్, సుమారు 5,700 మందికి నియామక పత్రాలు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో విజయవంతంగా నిర్వహణ యువజన సంఘాలు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధుల విశేష భాగస్వామ్యం యువతే తెలంగాణ భవిష్యత్తు అనే సందేశాన్ని బలంగా చాటిన కార్యక్రమంగా నిలిచింది. ఈ వారోత్సవాలు యువ శక్తిని సమాజాభివృద్ధి దిశగా మళ్లించే స్ఫూర్తిదాయక కార్యక్రమాలుగా ప్రశంసలు అందుకున్నాయి.



# స్మార్ట్ సురక్ష ఏఐ తో ఏఐ ఆధారిత డిజిటల్ సేవల్లో



**హైదరాబాద్ మే 24 సూర్య న్యూస్ :-** తెలంగాణలో డిజిటల్ పౌర సేవలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందిస్తున్న స్మార్ట్ సురక్ష ఏఐ అప్లికేషన్ లోగోను తెలంగాణ సచివాలయంలో ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రోటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు లోగోను విడుదల చేశారు. 2015లో ప్రారంభమైన బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ గత 11 సంవత్సరాలుగా ఐటీ రంగంలో సేవలు అందిస్తూ అభివృద్ధి సాధిస్తోంది. ప్రస్తుతం సంస్థ అభివృద్ధి చేస్తున్న "స్మార్ట్ సురక్ష ఏఐ" అప్లికేషన్‌ను రాబోయే మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓలు భాను చందర్ గరిగెల, శారదా నేనావత్ మాట్లాడుతూ ప్రజలకు మరింత సురక్షితమైన డిజిటల్ సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అదేవిధంగా, హర్కర వేణుగోపాల్ రావు బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ గత 11 సం. గా ఐటీ రంగంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించారు. వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, మొబైల్ అప్లికేషన్స్, ఈఆర్ పీ, క్లౌడ్, ఏఐ సర్వీసెస్ రంగాల్లో సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణలో స్మార్ట్, డిజిటల్ పౌర సేవల దిశగా మరో ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

# వడ్డెర కార్పొరేషన్ నూతన చైర్మెన్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ మే 24 సూర్య న్యూస్ :-** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మంజుల్కర్ ఆధ్వర్యంలో గాజులరామారం లోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన గుంజ రేణుక నారాయణ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభను ఉద్దేశించి మాట్లాడుతూ నూతన చైర్మన్ రేణుక నారాయణ గారికి శుభాకాంక్షలు అభినందనలు తెలియపరుస్తూ వారు వడ్డెర కులస్తుల అభివృద్ధికి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వడ్డెరల సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. అనంతరం మాజీ శాసనసభ్యులను కార్పొరేషన్ చైర్మన్ రేణుక శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వడ్డెర సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, గోగుల సరిత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గిరిబాబు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష



## ఇంచార్జ్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**హైదరాబాద్ జిల్లా బ్యూరో మే 24 సూర్య న్యూస్ :-** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం సైఫాబాద్ లోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ లో 119 దృష్టి వైకల్యం గల అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణసాగర్ 82 మంది హాజరైనారని, 37 మంది గైర్హాజరు అయ్యారని అలాగే పరీక్షా నిర్వహణ తీరు వివరించారు. పరీక్షల నిర్వహణలో దివ్యంగా విద్యార్థుల పట్ల ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా యూపీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే కలెక్టర్ మాసబ్ ట్యాంక్ లో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ను సందర్శించి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.చంద్రశేఖర్ 384 మంది అభ్యర్థులకు గాను 254 మంది హాజరు అయ్యారని తెలిపారు . కళాశాలలో ఏర్పాట్లను అలాగే హాజరు శాతాన్ని కలెక్టర్ తెలుసుకుని పరీక్షలు సజావుగా సమర్థవంతంగా నిర్వహణ జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉమెన్స్ సెంట్ ఆన్స్ కళాశాలను సందర్శించి రెండు విభాగాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను పరిశీలించి పరీక్ష నిర్వహణ తీరు, హాజరు శాతం తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి 1,152 మందికి అభ్యర్థుల కు గాను 788 మంది హాజరయ్యారని, 364 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. జిల్లాలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు మొత్తం 44,205 మంది కాగా మొదటి సెషన్స్ లో 29,609 మంది పరీక్షకు హాజరయ్యారని అలాగే 14,596 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. రెండో సెషన్స్ లో 44,205 మంది అభ్యర్థులలో 29,262 మంది పరీక్షకు హాజరు కాగా 14,943 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. తదుపరి కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, ఇంచార్జ్ డి.ఆర్.ఓ శ్రీధర్ లతో కలసి స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించి రూట్ల వారీగా ప్రశ్నా పత్రాలు, ఓఎంఆర్ షీట్లను ప్యాకింగ్ బండల్స్ తీసుకెళ్లే వాహనాలను పరిశీలించి పోలీస్ బందోబస్తు తో సురక్షితంగా కేంద్రాలలో చేరుకునే విధంగా చూడాలని పోలీస్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, జిల్లా పౌర సరఫరా అధికారి శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రవీందర్, తహసీల్దార్ శ్రీదేవి, వెన్యూ సూపర్వైజర్లు, పరీక్షల విభాగం పర్యవేక్షకులు మహేందర్ రెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**కుత్బుల్లాపూర్ మే 24 సూర్య న్యూస్ :-** కళ కళ కోసం కాదు. కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కోసం అని మొట్టమొదట నినదించింది ప్రజానాట్యమండలి. ఆనాడు దేశంలోని కళాకారులందరి సమీకరించి కళారూపాలద్వారా స్వాతంత్రోద్యమంల, విరోచిత తెలంగాణ సాయుధ పోరాటంలో నేటి తెలంగాణ పోరాటంలో పాలోని ప్రజలను చైతన్యవంతం చేసింది. తెలంగాణ ప్రజా నాట్యమండలి, తెలుగు సాంస్కృతిక రంగంలో తనదైన శైలి. ప్రజానాట్యమండలి ఒక మలుపు తీసుకొచ్చింది. కళ ప్రజల కోసం అనే తన ఆశయాన్ని వివిధ కళారూపాలకు, నిత్య జీవిత సమస్యలను, ఇతివృతాలుగా చేసి ప్రజలను చైతన్యవంతం చేసింది. ఆక్రమంలోనే మాభూమి, ముందడుగు,పరివర్తన,ం సామాజిక తెలంగాణ మొదలగు నాటకాలు జీవ కలైన జానపదాలను నూతన ఇతివృత్తాలతో జనరంజకంగా చేసి ప్రదర్శనలు ఇచ్చింది. దాని ఫలితమే నేటి వెలుగు లో ఉన్న బుర్రకథ, ఒగ్గుకథ, పల్లె సుద్దులు, వీధి నాటకాలు మొదలగు కళారూపాలు వెలికితీసింది. ప్రజానాట్యమండలి, చారిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటాన్ని తన కళారూపాల ద్వారా నీడలా పని చేసింది. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనీ కళాలు గళాలు తమ వీపుపై లాఠీ దెబ్బలు, డప్పు చప్పుళ్లుగా చేసి ప్రజల ఉత్తేజపరచి చైతన్యవంతులుగా చేసింది. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి సమస్యపై స్పందిస్తూ అనేక రకాల కళారూపాలు రూపొందించి ప్రజా సమస్యలపై స్పందించి పాట ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచింది. వృద్ధ కళాకారులకు పెన్షన్లు, అర్హులైన కళాకారులకు ఇండ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు, కోసం అనేక అందోలన కార్యక్రమాలు నిర్వహించింది. నిత్యం ప్రజా సమస్యల కోసం పరితపిస్తున్నది ప్రజానాట్యమండలి.అందులో భాగంగా ఈ నెల 25, 26వ తేదీలలో హైదరాబాద్ లో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలంటూ జగద్గిరిగుట్ట లో గోడ పత్రికను ఆవిష్కరిస్తూ పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, జిల్లా పార్టీ కార్యదర్శి ఉమా మహేష్, మండల పార్టీ సహాయ, కార్యదర్శి ఉజ్జిని హరినాథ్ రావు, రాములు, ప్రజానాట్యమండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్,, మండల అధ్యక్ష కార్యదర్శి బాబు, భాస్కర్ చారి, సహదేవరెడ్డి, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను తిప్పికోడతాం



**కుత్బుల్లాపూర్ మే 24 సూర్య న్యూస్ :-** కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పారిశ్రామిక ప్రాంత లోడింగ్ అన్లోడింగ్ హమాలీ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం. షాపూర్ నగర్ సిఐటియు కార్యాలయంలో కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిదులుగాగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను పెట్టుబడిదారుల కాళ్ల దగ్గర పెట్టిందని పెట్టుబడిదారుల ప్రయోజనలు తప్ప కార్మికుల ప్రయోజనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కొడ్స్ గా మార్చిందని అన్నారు.లేబర్ కొడ్స్ ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని కేద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కొడ్స్ కార్మికుల పాలిట ఉరి తాళ్లుగా మారయని కార్మికులపై పని భారం పెంచే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని, ఒకపక్క కార్మికులు హక్కుల కోసం పోరాడుతుంటే. ప్రభుత్వాలు మాత్రం ఉక్కుపాదంతో అమిచివేస్తున్నాయని బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదమని ఊకదంపుడు ఉపన్యాసాలు. చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబడ్ కొడ్స్ రాష్ట్రంలో ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో లేబర్ కొడ్స్ అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాలు పెంచుతు జీఓ ప్రకటించిందని, కనీస వేతనాల పెంపులో శాస్త్రీయత లేదని అన్నారు. కనీస వేతనాలు పెంచడమంటే ఉన్న వేతనాలను తగ్గించడమేనా .కనీస వేతనం లెక్కించాలంటే కార్మికుల కుటుంబ కనీస అవసరాలు పరిగణలోకి తీసుకోవాలనే ఆలోచన ప్రభుత్వం ఎందుకు చేయలేదని, ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలు స్వల్పంగా పెరిగీ. తగ్గాయని. ప్రభుత్వం చెపుతున్నట్లు గణనియంగా పెరగలేదని అన్నారు. కార్మిక సంఘాల, కనీస వేతనాల సలహా మండలి సిఫారసులను పరిగణలోకి ఎందుకు తీసుకోలేదని సుప్రీం కోర్ట్ తీర్పులకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి, నూతన లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా పోరాడాలని ఆసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు. ప్రభుత్వాలు అండగా ఉండాలని, సామాజిక భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దేవదానం, శ్రీనివాస్ మల్లారెడ్డి, భాషా, ఏఐటిసి నాయకులు స్వామి, నర్సింహులు, మహేషు, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం : ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్

**కొంపల్లి మే 24 సూర్య న్యూస్ :-** కొంపల్లి డివిజన్ పరిధిలోని ఎన్సీఎల్ సువేల సుకేతన్ విల్లాస్ లో లయన్స్ క్లబ్ కొంపల్లి లైఫ్ స్పేసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి, తలసేమియా బాధితులకు ఎంతగానో ఉపయోగపడే ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ కొంపల్లి లైఫ్ స్పేసెస్ బృందానికి నా అభినందనలు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి అభినందిస్తూ ఎమ్మెల్యే ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ రావు, ఉప్పల రమేష్, లయన్స్ క్లబ్ కొంపల్లి లైవ్ స్పేసెస్ సభ్యులు చిల్లా రాము, పసుపులేటి కృష్ణమూర్తి, రాజేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# కూకట్ పల్లి సర్కిల్ డిసి కి శుభాకాంక్షలు తెలిపిన హెచ్.ఎ.ల్ యూనియన్ నాయకులు

**కూకట్ పల్లి మే 24 సూర్య న్యూస్ :-** ఇటీవల కూకట్పల్లి సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు ని కూకట్పల్లి సర్కిల్ డిసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల భోకే, గౌతమ బుద్ధుడి ఫోటో ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన కూకట్పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షుడు కర్నాగరాజు. అనంతరం వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోనీ సమస్యలను పెండింగ్ పెట్టకుండా వెంటనే పరిష్కరిస్తారని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కుతాడి కృష్ణా, జాయింట్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్, ఐసిడి కంటైనర్స్ యూనియన్ నాయకులు జగన్, పాషా పాల్గొన్నారు.



సూర్య
సోమవారం 25 - 05 -2026

# ప్రతి కథా ఏకలవ్యుడి బొటన వేలే!








‘ఎస్టీ కాలనీ’ అని పిలవబడే ఒక ఎరుకుల సమూహాన్ని ‘ఏకలవ్య కాలనీ’గా పిలుచుకోవడం వెనుక ఆ ఊరి యువత ఆలోచన బైటి నుంచి చూస్తే సాధారణమైనదిగా కనపడవచ్చు. కానీ పలమనేరు బాలాజీ ‘ఏకలవ్య కాలనీ ఎరుకల జీవనగాథలు’ పుస్తకం చదివినాక ఆలోచిస్తే ఆ ప్రయత్నం మామూలుది కాదు అనిపిస్తుంది. స్వతంత్ర భారత దేశంలో మూలవాసులైన గిరిజనులపై వారి వారి జీవన విధానాల ఆధారంగా రాజ్యం రాసిన నెగెటివ్ హిస్టరీని రీరైట్ చెయ్యాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి ఈ పుస్తకంలోని కథలు.అడవి తీరప్రాంతాన, వ్యవసాయ ప్రధానంగా జీవనం సాగిస్తున్న ఒక ఆదిమ సమాజం దొంగలుగా చిత్రించబడటం ఒక కుట్ర. ఒక సమూహాన్నే వెలి వేయడం, నిర్లక్ష్యంగా పక్కన పెట్టడం ఒక వ్యూహం. అందులో భాగంగానే పాలకుల తీరు, ఇతర సమాజాల అణచివేత ఒక పథకం ప్రకారం జరుగుతున్నదని మనకు అర్థం చేయిస్తుంది ఈ పుస్తకం. ఈ కథల్లో ఒక కాలేజీ కుర్రాడు కొత్త ఫోను పట్టుకుని కాలేజీకి వెళ్తే “యాడ కొట్టుకొస్తివిరా ఇంత కొత్త ఫోను” అని ప్రశ్నిస్తుంది ఇతర సమాజం. అదే కథలో మరోచోట “మీకే మప్పా, మీరు దేవుడి బిడ్డలు. రిజర్వేషన్లున్నాయి” ఎత్తి పొడుస్తుంది. మరి స్వతంత్ర స్వర్ణోత్సవ సమయానికి ఈ పాత్ర తండ్రి ఎలా జీవించి వుంటాడు? ఎన్ని అవమానాల్ని ఎదుర్కొని వుండివుంటాడు? ఆ ముందు తరం ఏ మానసిక వేదనని మోస్తూ దాన్ని నేటి తరానికి వారసత్వంగా ఇచ్చి వుంటుంది? “అభివృద్ధి, మార్పు, సమానత్వం అనేవి రావడానికి ఇంకా ఎన్నేళ్ళు వెయిట్ చెయ్యాలి సార్?” అని మరో చోట ప్రశ్నిస్తుంది ఇదే కథలో మరో పాత్ర. ఈ మాటలో వెయిటింగ్ పట్ల అసహనం కనిపిస్తుంది. ఇది తరాల నిరీక్షణ. ఈ పుస్తకంలో ఒక చోట ఆ ఎస్టీ కాలనీలో ఒక దృశ్యం పాఠకుడికి ఇలా ఎదురవుతుంది: “గుడి పక్కనే ఒక మొండి గోడల ఇల్లు... తలుపు సగం ఊడిపోయి, ఎప్పుడూ మూయాల్సిన అవసరమే లేనట్టు. బయటే నులక మంచం పైన ఒక సగం మనిషి కూర్చునో లేదా పడుకునో ఉంటాడు. పగల్లో కానీ, రాత్రుల్లో కానీ అతడు నిద్రలోకి వెళ్ళి వస్తుంటాడు. మెలకువలో కూర్చుని గుడ్డ పేలికలతో తాడు పేనడమో, వెదురు దబ్బల్తో తట్టో, బుట్టో, చాటో అల్లడమో చేస్తుంటాడు. రాత్రని, పగలని అతడికి స్పృహ ఉండదు. వానా, చలి, ఎండా ఏ తేడా తెలీదు. అతడి లోకం అతడిదే.” ఈ వర్ణనతో అక్కడి దృశ్యం క్రమక్రమంగా మనకు స్పష్టమవుతూ కనిపిస్తూ వుంటుంది. అక్కడి మనుషుల జీవన విధానం, అక్కడి పరిస్థితులూ ఒక్కొక్కటిగా మనకు అర్థమవుతూ వుంటాయి.ఇందులో ఆ “సగం మనిషి”ని మనకు చెప్పడానికి రచయిత అక్కడి మైన్యూట్ ఇష్యూస్‌ని కథలోకి తీసుకురావడాన్ని అభినందించకుండా వుండలేం. ఇలా చెప్పాలంటే ఆ రచయిత కచ్చితంగా ఆ కాలనీలో నివసించే వ్యక్తే అయి వుండాలి. లేదా అక్కడ జీవితాలతో ప్రత్యక్ష అనుబంధాలను కలిగి వుండాలి. లేకపోతే ఈ విధమైన నెరేషన్ వీలుకాదు.ఇందులో ఒక పాత్ర మనతో చెప్తుంది: “ఒకరి బాధలు ఒకురికి చెప్పుకోవల్లంటే ఒకరి కష్టానికి ఒకురు రావల్లంటే అంతా ఒక్కచోట వుంటే మంచిది కదా వదినా” అని. ఎవరి బతుకు బాధల్లో వాళ్ళు ఎవరికి వారై వేరై పలుచోట్లకు పోతుంటే, ఎదురైన పీడనని ఎదుర్కోవడం సాధ్యం కాదనే స్పృహ అంతర్లీనంగా ధ్వనిస్తుందీ మాటల్లో. “పందుల్ని మేపినా, గాడిదల పైన ఉప్పు అమ్మినా, తట్టా బుట్టా అమ్మినా, యెర్రమన్ను, ముగ్గుపిండి అమ్మినా మనల్ని అడిగేవోడు లేదు. మన కాళ్ళపైన మనం నిలబడి మన కష్టం తింటూ ఉండామే కానీ ఉన్నప్పుడు తిని, లేనప్పుడు పస్తయినా వుండామే కానీ ఏ పొద్దూ ఎవరి సొత్తుకు అయినా పోతాండామా,” అని అదే పాత్ర చెప్తున్నప్పుడు మనకి ఆ మనుషుల బతుకు చిత్రాలు కనిపిస్తాయి. వృత్తులు స్పష్టమవుతాయి. కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, బరువులూ అర్థమవుతాయి. “ఇప్పుడు వాళ్ళందరూ ముసలి వాళ్ళయిపోయారు, వాళ్ళను కదిలిస్తే చాలు కన్నీళ్ళు జలజలా నేల రాల్తాయి. బతుకుదారులు వేరైనా వాల్లందరివీ కంటికి కడవెడు కన్నీళ్ళు నింపుకున్న కతలే” అని రచయితే ఒక చోట అంటాడు. అతని మాటల్లో ఆ నేలరాలిన కన్నీళ్ళని రికార్డు చెయ్యాలనే తపన కనిపిస్తుంది. ఈ వ్యథలు బయటి ప్రపంచానికి తెలియచెప్పాలన్న సంకల్పం కనిపిస్తుంది. ఇదా మన భారతం అని ఎవరినో ప్రశ్నిస్తున్నట్టనిపిస్తుంది. ‘ఏకలవ్య కాలనీ’ సంపుటిలోని కథలన్నీ ఒక ప్రశ్నతో ముగుస్తాయి. ముగిసిన తరవాత పాఠకునిలో ఒక అలజడికి, ఆలోచనకి కారణమవుతాయి. ఈ ప్రశ్నలన్నీ పాఠకుడిలో ఒక మెలకువని కలిగిస్తాయి. అంటే కథ ముగిసిన తరువాత మథనం ప్రారంభమవుతుంది. అదే కదా సాహిత్యం అంతిమ లక్ష్యం. ఆ పని సులభంగా చేస్తాయీ కథలు. ఇదంతా ఎందుకు చెప్పాల్సొస్తున్నదంటే: ఇవన్నీ ఎరుకల కథలు. ఇంతదాకా ఎవరూ తడమనివి. తడిమినా ఇంత లోతుల్లోంచి చెప్పినవి కాదు. పలమనేరు బాలాజీ ఇప్పటికే కథకునిగా, కవిగా అందరికీ పరిచయమైనవారు. నా అంచనా తప్పు కాకపోతే ఆయన ఇంతకుముందు రాసిన పలు కథాకవిత్వాలకూ, ఈ పుస్తకానికీ స్పష్టమైన తేడా వుంది. అది అస్తిత్వ పరామర్శ. నా ఉద్దేశ్యం వాటిల్లో ఈ స్పృహ లేదని కాదు. ఇందులో బలంగా వున్నదని.ఇన్నాళ్ళూ వివక్ష, అణచివేత, పీడనలు దళితజీవితాల్లో మాత్రమే ఉన్నాయ నుకునేది సమాజం. అంటరానితనం ఒక్క దళితులకు మాత్రమే ఎదురయ్యేది అనే అవగాహన వుండేది. కానీ అంటరానితనం గిరిజన కులాల్లో కూడా ఒక ముల్లులా గుచ్చుకుంటున్నదన్న వాస్తవాన్ని చెప్పే ప్రయత్నం చేసాయి ఈ కథలు. నొప్పిని భరిస్తున్న కమ్యునిటీస్ లోంచి ప్రశ్నించడం మొదలయ్యింది అని ప్రకటిస్తున్నాయి ఈ కథలు.ఈ కథల్లో ఒక పాత్ర అంటుంది: “ఈ దేశానికి ఒక్క అంబేద్కర్ చాలడు. ఇంటికొక్క అంబేద్కర్ రావల్ల” అని. ఎనభైయ్యేళ్ళ ఆ పాత్ర అంబేద్కర్‌ని అణువణువునా జీర్ణించుకున్న ఉడుకోడు పాత్ర. “ఎరికిలోడు సేద్యం ఒక్కటే నేర్చుకుంటే సాలదు మామా, పోరాటం చెయ్యడం నేర్చుకోవల్ల, బతకాలంటే కరువుతోనే కాదు, మొండిమేఘాలతోనే కాదు, మొండి మనుషులతో, పెద్ద కులమోళ్ళతో పోరాటాలు చెయ్యడం నేర్చుకోవల్ల” అని ఉడుకోడు తోటి వారిని చైతన్యపరుస్తుంటే ఆ ఒక్క ఎస్టీ కాలనీకి చెందిన వారికే కాదు పీడితులందరికీ తత్వబోధ చేస్తున్నాడని మనకి ఇట్టే అర్థమైపోతుంది. “బతికేదానికి వయసుతో పనేముంది మామా, ఏ వయసోడికైనా బతకాలంటే నెత్తురు ఉడుగ్గానే ఉండల్ల. అసలు మనిషనేవాడు ఎప్పుడూ ఉడుకుడుగ్గానే ఉండల్ల,” అని కుండబద్దలుకొట్టినట్టు చెప్తుంది ఉడుకోడు పాత్ర. సాహిత్యలోకంలో బలహీనంగా వున్న గిరిజన స్వరం బృందగానంగా మారడానికి గొంతెత్తిన చైతన్యస్వరమీ కథలు. కథల్లో, కవితల్లో ఇప్పుడిప్పుడే గొంతు విప్పుతున్న గిరిజన గళాలకి ఈ కథలు మార్గనిర్దేశం చేస్తాయి. వివిధ ఉపకులాలుగా వున్న అడవి బిడ్డలకు ఈ కథలు కొత్త పాఠాలు నేర్పుతాయి. ప్రతి ఉపకులం నుంచీ ఇలాంటి కథలు రావాలన్న సందేశాన్ని పంపుతాయి. ఎవరి పెయిన్‌కి వాళ్ళే అరవాలి, వాళ్ళే ఆ పెయిన్‌ని ప్రకటించుకోవాలి. అది ప్రజాస్వామ్య ప్రాథమిక లక్షణం. ఆ డెమొక్రటిక్ స్పేస్‌కి నిజమైన డెఫినిషన్‌ని ప్రకటిస్తాయి ఈ కథలు. ఇందులో ప్రతి కథా తెగిన ఏకలవ్యుడి బొటన వేలే.

చెప్పిన ప్రతి సంఘటనా నేల రాలిన ఏకలవ్యుడి నెత్తుటి బొట్టే. ప్రతి అక్షరమూ వేలుని తెగ్గోయడం వెనక దాగిన కుట్రల్ని బహిర్గతం చేసేదే. అందుకే ఈ కథలు చరిత్రని తిరగ రాయాల్సిన అవసరాన్ని చెప్పకనే చెప్తాయి. ఈ కథలతో బాలాజీ ముందుండి గిరిజన స్వరాన్ని ఎత్తుకున్నందుకు అతన్ని హత్తుకోవాల్సిందే.

# శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు



**మాదాపూర్ మే 24 సూర్య న్యూస్ :-** మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి ఉదయ్ కృష్ణ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, తాండవ నృత్యకారి, నామరామాయణం, ఒకపరి కొకపరి, రామాయణశబ్దం అంశాలను ఐశ్వర్య, తన్వి, ఆధ్య, మహీరా, శ్రీనిక, జొశ్విక దేదీప్య మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. బెంగళూరు నుండి విచ్చేసిన నృత్యరంజని ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు శాంత కృష్ణ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శనలో “శ్రీ రామ చరితం“ నృత్య రూపకం ప్రదర్శించారు. వీరికి నందకుమార్ గాత్ర సహకారం, కృష్ణ బాత్ వేణువు సహకారం, కార్తీక్ మృదంగ సహకారం, శ్రీకాంత్ రిథమ్ పాడ్ పై సహకారం అందించారు. అమూల్య, రిషిత, సహస్ర , శ్రితి, శ్రావ్య, బృంద, భవ్య మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



# ఎండల దేశంగా మారుతున్న భారత్

ఒకప్పుడు రాజస్థాన్ ఎడారుల్లో మాత్రమే కనిపించిన తీవ్రమైన ఎండలు ఇప్పుడు భారతదేశం మొత్తాన్ని కమ్మేస్తున్నాయి. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు, నాగ్‌పూర్ నుంచి పట్నా వరకు, నగరాలు వేసవికాలంలో నిప్పుల కుండల్లా మారుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉన్నప్పటికీ, భారతదేశంలో పెరుగుతున్న అసాధారణ ఉష్ణోగ్రతలు కేవలం ప్రకృతి సహజ పరిణామాల ఫలితమే కాదు; అవి రాజకీయ నిర్ణయాలు, కార్పొరేట్ ఆధారిత అభివృద్ధి నమూనాలు, పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేసిన పాలనా విధానాల ప్రత్యక్ష ఫలితాలు కూడా. గత దశాబ్ద కాలంగా దేశంలో నమోదవుతున్న వేడి తరంగాలు భయంకర స్థాయికి చేరుకున్నాయి. భారత వాతావరణ విభాగం గణాంకాల ప్రకారం, 20242026 మధ్య కాలంలో ఉత్తర, మధ్య, దక్షిణ భారత రాష్ట్రాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్ దాటాయి. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికలు కూడా దక్షిణాసియా ప్రాంతం వేడెక్కుతున్న వేగం ప్రపంచ సగటు కంటే అధికమని హెచ్చరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నగరాలు నివాసయోగ్యంగా ఉండాలంటే అడవులు, నీటి వనరులు, పచ్చదనం అత్యవసరం. కానీ భారతదేశంలో జరుగుతున్నది ఇందుకు పూర్తి విరుద్ధం.2014 తర్వాత దేశంలో “అభివృద్ధి” పేరుతో పర్యావరణ చట్టాలను బలహీనపరిచే ప్రక్రియ వేగం పెరిగింది. పర్యావరణ అనుమతుల వ్యవస్థను సరళీకరణ పేరుతో కార్పొరేట్ ప్రాజెక్టులకు అనుకూలంగా మార్చారు. క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రజాభిప్రాయ సేకరణలు, స్థానిక సమాజాల అభ్యంతరాలను క్రమంగా నామమాత్రం చేశారు. 2020లో తీసుకువచ్చిన పర్యావరణ ప్రభావ అంచనా ముసాయిదా తీవ్ర విమర్శలకు గురైంది. ముందస్తు అనుమతులు లేకుండా ప్రాజెక్టులు ప్రారంభించినా తర్వాత జరిమానాతో చట్టబద్ధం చేసుకునే అవకాశం కల్పించడం పర్యావరణ పరిరక్షణ భావనకే విరుద్ధం.అదే విధంగా అటవీ సంరక్షణ చట్ట సవరణల ద్వారా లక్షల హెక్టార్ల అటవీ భూములను మినహాయింపుల కిందకి తీసుకువచ్చారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలు, వ్యూహాత్మక ప్రాజెక్టులు, గనుల తవ్వకాల పేరుతో అడవుల నరికివేతకు వేగంగా అనుమతులు ఇచ్చారు. ఫలితంగా దేశంలో ప్రకృతి సమతౌల్యం ప్రమాదంలో పడుతోంది. పర్యావరణ కార్యకర్తలు పదేపదే హెచ్చరిస్తున్నా, పాలక వ్యవస్థ మాత్రం పారిశ్రామిక వృద్ధినే ప్రాధాన్యంగా చూపిస్తోంది.ఛత్తీస్‌గఢ్‌లోని హస్డియో అరండ్ అడవులు దీనికి స్పష్టమైన ఉదాహరణ. మధ్య భారతదేశానికి ఊపిరితిత్తులుగా పరిగణించే ఈ అడవులను బొగ్గు గనుల కోసం అప్పగించడంపై గిరిజనులు, పర్యావరణ ఉద్యమకారులు భారీ స్థాయిలో నిరసనలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ గనుల ప్రాజెక్టులు ఆగలేదు. ఇదే విధంగా ముంబై మడ అడవుల విధ్వంసం నగరాన్ని వరద ముప్పుకు మరింత దగ్గర చేసింది. గ్రేట్ నికోబార్ దీవుల్లో మెగా ప్రాజెక్టుల పేరుతో అరుదైన వర్షారణ్యాలను నాశనం చేయడం ప్రపంచ పర్యావరణ వర్గాల్లో ఆందోళన కలిగించింది.అడవుల నరికివేత కేవలం చెట్లు కోల్పోవడమే కాదు; అది వర్షపాతం వ్యవస్థను దెబ్బతీస్తుంది, భూగర్భ జలాలను తగ్గిస్తుంది, కార్బన్ శోషణ సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. నగరాల్లో పెరుగుతున్న “హీట్ ఐలాండ్ ఎఫెక్ట్” కారణంగా కాంక్రీట్ భవనాలు పగటి వేడిని రాత్రివేళ కూడా విడుదల చేస్తూ ఉష్ణోగ్రతలను మరింత పెంచుతున్నాయి. ఫలితంగా పేదలు, కార్మికులు, వీధి వ్యాపారులు, వృద్ధులు అత్యధికంగా ప్రభావితమవుతున్నారు. లాన్సెట్ నివేదికల ప్రకారం భారత్‌లో ప్రతి ఏడాది వేలాది మంది వేడి సంబంధిత అనారోగ్యాలతో మరణిస్తున్నారు. కానీ దీనిపై ప్రభుత్వ స్థాయిలో సమగ్ర ప్రజా ఆరోగ్య ప్రణాళికలు కనిపించడం లేదు.ప్రభుత్వాలు తరచూ దేశంలో అడవుల విస్తీర్ణం పెరుగుతోందని అధికారిక నివేదికలు విడుదల చేస్తున్నాయి. అయితే పర్యావరణ నిపుణులు చెప్పేది వేరే. సహజ అటవీ వ్యవస్థలను నాశనం చేసి వాటి స్థానంలో వాణిజ్య తోటలు పెంచడం ద్వారా గణాంకాలను అందంగా చూపిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. యూకలిప్టస్, తాటి, రబ్బరు వంటి వాణిజ్య పంటలను అడవులుగా చూపించడం వల్ల జీవ వైవిధ్యం కాపాడబడదు. నిజమైన అడవి అనేది కేవలం చెట్ల సమూహం కాదు; అది వందలాది జీవరాశుల జీవన వ్యవస్థ.ఇక మరో ప్రమాదకర అంశం మీడియా పాత్ర. కార్పొరేట్ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ప్రధాన మీడియా వాతావరణ సంక్షోభాన్ని గంభీరంగా చర్చించకుండా రాజకీయ ప్రచారాలతో ప్రజల దృష్టిని మళ్లిస్తోంది. నిరుద్యోగం, రైతు సంక్షోభం, నీటి కొరత, పెరుగుతున్న వేడి వంటి అసలు సమస్యలపై జాతీయ చర్చ జరగాల్సిన సమయంలో మత, జాతి, ఎన్నికల రాజకీయాలకే అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఫలితంగా పర్యావరణ విధ్వంసం ఒక నిశ్శబ్ద విపత్తుగా మారుతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పుడు పునరుత్పాదక శక్తి, పట్టణ హరితీకరణ, నీటి సంరక్షణ, పర్యావరణ అనుకూల రవాణా విధానాల వైపు అడుగులు వేస్తున్నాయి. కానీ భారతదేశంలో ఇంకా బొగ్గు ఆధారిత అభివృద్ధి నమూనానే కొనసాగుతోంది. కార్పొరేట్ లాభాల కోసం ప్రకృతిని నిరంతరం త్యాగం చేస్తే, చివరికి ఆ మూల్యం చెల్లించేది సాధారణ ప్రజలే. అసాధారణ ఎండలు, నీటి సంక్షోభం, వరదలు, తుఫానులు అన్నీ అదే హెచ్చరికలు. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు; కానీ మన తప్పులను మాత్రం ఖచ్చితంగా ప్రతిబింబిస్తుంది. అడవులను నరికేస్తూ, నదులను కాలుష్యం చేస్తూ, నగరాలను కాంక్రీట్ అడవులుగా మార్చేస్తూ “అభివృద్ధి” సాధ్యమని భావించడం ప్రమాదకర భ్రమ. భారతదేశ భవిష్యత్తు కేవలం ఆర్థిక వృద్ధిపై కాదు; పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడే రాజకీయ సంకల్పంపై ఆధారపడి ఉంది. లేకపోతే రాబోయే తరాలు ఈ దేశాన్ని “ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యం”గా కాకుండా, “అత్యంత వేడి భూమిగా” గుర్తుంచుకునే ప్రమాదం ఉంది.

# కర్ణుడివిషాదాంతం: తరతరాలపద్యకవిత్వం

నిత్యజీవితంలో ఓటమికీ, పతనానికీ, విషాదాంతానికీ కారణాలు చెప్పాల్సివస్తే... కర్ణుడితో పోలిక తేవడం మన తెలుగువారి అలవాటు. సంభాషణల్లో, ప్రసంగాల్లో, రాతల్లో, సాహితీ చర్చల్లో ఇది తరచూ జరిగేదే. విషయాన్ని బలంగా, మనసుకు హత్తుకునేలా చేయగల ప్రతీక ఇది. ‘కర్ణుడి చావుకు వేయి కారణాలన్నట్టు..’ అంటూ చెప్పేవాళ్లున్నారు. ఆ కారణాలు వంద అనీ, (సవా)లక్ష అనీ కొందరంటుంటారు. ఇంకొంతమందైతే ‘కోటి కారణాల’ని చెప్తుంటారు. ఆ లెక్క ఏమిటో తేల్చకుండా ‘కర్ణుడి చావుకు కారణాలెన్నో అన్నట్టు’ అంటూ గడుసుగా పోల్చేవాళ్లూ కనిపిస్తారు. ఇక్కడ వారు చెప్పే సంఖ్యకు ప్రాధాన్యం లేదనీ, ‘లెక్కలేనన్ని కారణాలు’ అనేది వారి భావమనీ తెలుస్తూనే ఉంటుంది. ఇంతకీ కర్ణ కథ ఉన్న ‘మహాభారతం’ కర్ణ వధకు కారకులు ఎందరని చెప్తోంది? దీంతోపాటు జనశ్రుతిలో ఉన్న, బహుళ ప్రాచుర్యం పొందిన చాటువు విశేషాలేమిటి? ‘కర్ణుడు లేని భారతం శొంఠి లేని కషాయం’, ‘కర్ణునితో భారతం సరి.. కార్తీక మాసంతో వానలు సరి’... ఇలాంటి సామెతలూ, నానుడులూ ఈ ఇతిహాసంలో కర్ణుడి పాత్ర ప్రాముఖ్యం ఎంతటిదో చెప్తున్నాయి. జననం, మరణం.. ఈ రెండూ మాత్రమే కాకుండా జీవిత పర్యంతం కర్ణుడి ప్రస్థానం విషాదభరితం. చేసిన దానం, ఇచ్చిన వరం, నిందలూ, శాపాలూ, అవమానాలూ... ఇవన్నీ అతడి పతనానికి దారులు పరిచాయి.

వేల ఏళ్ల క్రితం వేద వ్యాసుడు సంస్కృతంలో రాసిన మహాభారతం శాంతిపర్వం ఐదో అధ్యాయంలో

బ్రాహ్మణస్యాపి శాపేన రామస్య చ మహాత్మనః
కుంత్యాశ్చ వరదానేన మాయయా చ శతక్రతోః
భీష్మావమానాత్సంఖ్యాయాం రథానామర్ధకీర్తనాత్
శల్యాత్తేజో వధాచ్చాపి వాసుదేవనయేనచ

అంటూ నారదుడు చెప్పిన విషయం శ్లోక రూపంలో ఉంది. దీని ప్రకారం కర్ణుని మరణానికి ఏడు హేతువులు. బ్రాహ్మణ శాపం, పరశురాముని శాపం, కుంతీదేవి పొందిన వరం, ఇంద్రుడి మాయ, భీష్ముడి అవమానం, శల్యుడి హేళన, కృష్ణుడి వ్యూహం. ఇంతకీ చంపినవాడు ఫల్గుణుడు కదా? అతడి ఊసేదీ? అందరికీ తెలిసిన సత్యమే కాబట్టి వేదవ్యాసుడు నారదుడితో అర్జునుడి పేరును ప్రత్యేకంగా చెప్పించి వుండకపోవచ్చు. ఇదే శ్లోకాన్ని 13వ శతాబ్దిలో ‘శ్రీమదాంధ్ర మహాభారతం’లో తిక్కన ఇలా అనువదించాడు (శాంతిపర్వ ప్రథమాశ్వాసంలోని 35వ చంపకమాల పద్యం): ‘వినుము నరేంద్ర! విప్రుడలివెన్, జమదగ్నిసుతుండు శాపమిచ్చె, నమరభర్త వంచనము చేసె, వరంబని కోరి కుంతి మాన్చెనలుక, భీష్ముడర్ధరథు జేసి యడంచె గలంచె మద్రరా జనుచితమాడి, శౌరి విధియయ్యె, నరుండటు జంపె గర్ణునిన్’ (‘ధర్మరాజా! నేను చెప్పేది విను. బ్రాహ్మణుడు కోపగించి యుద్ధంలో రథచక్రం భూమిలోకి కుంగిపోతుందని శపించాడు. తర్వాత పరశురాముడు తాను నేర్పిన దివ్యాస్త్రాలు అవసరమైనపుడు పనిచేయబోవని శాపం పెట్టాడు. ఇంద్రుడు మోసం చేసి సహజ కవచ కుండలాలను గ్రహించాడు. కుంతి వరమనే నెపంతో కోరి అతడి కోపాన్ని మాన్పింది. భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడిగా చేసి అగౌరవపరిచాడు. శల్యుడు అనుచిత వాక్కులతో హృదయాన్ని కలతపెట్టాడు. కృష్ణుడు అతడికి దాటరాని విధిగా నిలిచాడు. ఇన్ని జరగ్గా అర్జునుడు కర్ణుడిని రణరంగంలో వధించగలిగాడు.) తెలుగు భారతంలో ‘నరుండటు జంపె గర్ణునిన్’ అంటూ తిక్కన అర్జునుడినీ చేర్చి లోటు తీర్చాడు! ఇలా తెలుగు భారతం ప్రకారం.. ఎనిమిది మంది కారకులు.ఈ జాబితాలో ఉన్న బ్రాహ్మణుడినీ, భీష్ముడినీ, శల్యుడినీ తీసివేస్తే ఐదుగురు. వారికి ధర (భూదేవి)ను కలిపి ఆ ఆరుగురే కర్ణుడి చావుకు కారకులంటూ... అర్జునునికి కృష్ణుడే చెప్పినట్టు ప్రచారంలోకి వచ్చిందో కంద పద్యం.

‘నరవర! నీచే నాచే
వరమడిగిన కుంతి చేత వాసవు చేతన్
ధరచే భార్గవు చేతన్
అరయంగా కర్ణుడీల్గె నార్గుర చేతన్’


ఈ చాటుపద్య సృష్టికర్త ఎవరో ఎవరికీ తెలియదు. కవిత్వ సంపద లేకపోవచ్చు కానీ.. సూటిగా తేటగా చెప్పిన పద్యమిది అని పండితుల ఉద్దేశం.ఈ చాటువుకు మూలం ఏమై వుంటుంది? భారతానికి అనుబంధంగా ‘భారత సార సంగ్రహం’గా పేరుకెక్కిన చిన్న పుస్తకం ‘భారత సావిత్రి’. 17వ శతాబ్దికి చెందిన నీలకంఠ చతుర్ధర మహాభారత వ్యాఖ్యానాన్ని పరిష్కరించి మహారాష్ట్ర పండితుడు రామచంద్రశాస్త్రి కింజ్ వాడేకర్ 1936లో దీన్ని ప్రచురించారు. దీనిలో ప్రక్షిప్తాలు (కవి రాసిన గ్రంథంలో తర్వాతి కాలం కవులు చేర్చిన భాగాలు) ఉన్నాయనే వాదన ఉంది. దానిలోదే ఈ శ్లోకం

‘త్వ(యా) మయా చ కుంత్యాచ ధరణ్యా వాసవేన చ
జామదగ్న్యేన రామేణ షడ్భిః కర్ణో నిపాతితః’

దీన్ని దాదాపు యథాతథంగా తెలుగు చాటువుగా మలిచారని ఊహించవచ్చు. అయితే, 1936కి ముందే తెలుగు చాటువు ప్రాచుర్యంలో ఉంది. అంటే అంతకు పూర్వం ఉన్న ఏదో ఒక ప్రచురణలోని ఇదే శ్లోకం ఆధారంతో చాటువు పుట్టి వుంటుంది. (‘కర్ణ, శాంతి పర్వాల’ తిక్కన భారత ఆంధ్రీకరణ 13వ శతాబ్దిలోనే పూర్తయింది.)‘ధరణి శాపం’ భారతంలో ఎక్కడా లేదు. ఒకప్పుడు గురువాజ్ఞతో కర్ణుడు నేతిని పాత్రలో తెస్తుండగా అది జారి భూమ్మీద పడి ఒలికిపోయింది. మళ్లీ నేతిని తేవడానికి వెళ్తే సమయం మించిపోయి గురువు కోపగిస్తాడనే భయంతో అక్కడినేలను బలంగా పిండి, నేతిని పాత్రలోకి నింపుకుంటాడు. తనను నిర్దయగా బాధపెట్టాడని కోపించిన భూదేవి యుద్ధసమయంలో అతడి రథచక్రం తనలో కుంగిపోతుందంటూ కర్ణుడికి శాపమిస్తుంది. లోకంలో ప్రసిద్ధంగా ఉన్న ఈ కథ ప్రస్తావనే చాటువులోనూ, శ్లోకంలోనూ చేరింది. ఈ చాటువుకు పాఠ భేదాలు కూడా కనిపిస్తాయి.

‘నరు చేతను నా చేతను
వరమడిగిన కుంతిచేత వాసవుచేతన్
ధర చేత శల్యుచేతను అరయంగా గర్ణుడీల్గె నార్వుర చేతన్’

ఇలా... పరశురాముడి స్థానంలో శల్యుడిని జోడించడం కొన్నిచోట్ల కనిపిస్తుంది. “నీ చేతను నా చేతను” అంటూ తొలి పాదం.. ఛందోబద్ధం కానప్పటికీ లోకుల నోట నానటం ఓ విశేషం. వేటూరి ప్రభాకరశాస్త్రి సేకరించి సంకలనం చేసిన ‘చాటుపద్య మణిమంజరి’ రెండు భాగాల్లోనూ (1913, 1922), దీపాల పిచ్చయ్యశాస్త్రి రూపొందించిన ‘చాటు పద్య రత్నాకరము’ (1917)లోనూ ఈ చాటువు చోటుచేసుకోలేదు. కానీ ఆ కాలానికే ఈ చాటు పద్యం ప్రాచుర్యంలో ఉంది. ఈ చాటువును మూడు తెలుగు పుస్తకాల్లో ప్రముఖంగా ప్రస్తావించారు: 1917లో రాసి 1928లో వజల చినసీతారామశాస్త్రి వచన రచన ‘కర్ణ చరిత్ర’, 1929లో సోమరాజు రామానుజరావు రచించిన నాటకం ‘దానవీర కర్ణ’, 1935లో మ. శ్రీరామమూర్తి ఇదే పేరుతో రాసిన మరో నాటకం.192728లో గుర్రం జాషువ రచించిన ‘భారత వీరుడు’ పద్యాలు ‘భారతి’లో వెలువడ్డాయి. అంటే దాదాపు వందేళ్ల క్రితం! అందులో కర్ణుడిని శ్లాఘిస్తూ అన్యాయంగా వధించారని బాధపడుతూ అతడిని ఓదారుస్తూ రాశారు కవి.‘నా యరదంబు క్రుంగిన దనంత, కిరీటి, క్షణంబు తాళుడో



EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD - 500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD -500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO: 8985586689, EMAIL: suryavelugutelanganadesk@gmail.com, Web SITE: www.suryavelugu.com